ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
ఆదివారం 18 మే 2025

అభివృద్ధి పనులను పరిశీలించిన రైల్వే జీఎం



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్

పెద్దపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి రైల్వే జంక్షన్‌లో జరుగుతున్న స్టేషన్ ఆధునికీకరణ పనులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ పరిశీలించారు. అమృత్ భారత్ పథకం ద్వారా ఈ స్టేషన్‌కు 22 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. యేడాది కాలంగా ఇక్కడ పనులు జరుగుతున్నాయి. శనివారం వరంగల్ స్టేషన్ సందర్శించిన జీఎం పెద్దపల్లి మీదుగా కరీంనగర్ వెళుతున్న క్రమంలో పెద్దపల్లిలో అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని, జాప్యం జరగకుండా గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వారానికి ఐదు రోజులు నడుస్తున్న చెన్నై జోధ్‌పూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలుకు పెద్దపల్లి జంక్షన్‌లో హాల్టింగ్ ఇవ్వాలని జీఎంకు వినతి పత్రం అందజేశారు. డీఆర్ఎం భారతీష్ జైన్, ఇంజినీరింగ్ అధికారులు, తదితరులున్నారు.

నేటి నుంచి చిన్నకలువల అంజన్న ఆలయ బ్రహ్మోత్సవాలు

● ఈనెల 20న కల్యాణం 8

- అలస్యంగా పంటలు వేయడం వల్ల నష్టాలు
- దిగుబడులు తగ్గడంతోపాటు ప్రకృతి వైపరీత్యాల బెడద
- రైతులకు అవగాహన కల్పించాలని నిర్ణయం



ముందస్తు సాగుపై దృష్టి

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రతి సీజన్‌లో పంటలు ఆలస్యంగా సాగు చేయడం వల్ల దిగుబడులు తగ్గడంతోపాటు ప్రకృతి వైపరీత్యా లతో పంట నష్టం జరుగుతోంది. దీని నుంచి రైతులను కాపాడేందుకు ముందస్తు పంటల సాగుపై జిల్లా అధి కార యంత్రాంగం దృష్టి సారించింది. ఈ నెల 25వ తేదీన రోహిణి కార్తె ప్రవేశిస్తుండడంతో వానాకాలం పంటల సాగుకు శ్రీకారం చుట్టనున్నారు. వానాకాలం పంటలను జూన్‌లో ఆరంభించి అక్టోబర్‌లో ముగించాల్సి ఉండగా, నవంబర్, డిసెంబర్ మొదటి వారం వరకు, యాసంగి సీజన్ నవంబర్‌లో ఆరంభించి ఏప్రిల్ మొదటి వారంలోగా ముగించాల్సి ఉండగా, పం టల కాలం నెల, రెండు మాసాలు పెరిగాయి. ఈ కారణంగా నవంబర్, డిసెంబర్, ఏప్రిల్, మే నెలలో కురిసే అకాల వర్షాలు, వడగళ్ల వల్ల రైతులు పెద్ద ఎత్తున పంటలు నష్టపోతున్నారు. అంతేగాకుండా సకాలంలో పంటలు వేయక పోవడంతో తెగుళ్లు సోకి పంట దిగుబడులు తగ్గిపోతున్నాయి. నష్టాల నుంచి రైతులను కాపాడేందుకు కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. వ్యవసాయ, ఇతర అను బంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ప్రత్యేక

(మిగతా 8వ పేజీలో)

జిల్లాలో వానాకాలంలో ముందస్తు పంటలు జూన్ నుంచి అక్టోబర్ వరకు పూర్తి చేయాలని, యాసంగి పంటలు నవంబర్ నుంచి మార్చి నెలాఖరు వరకు పూర్తయ్యేలా పండించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డి సూచిస్తున్నారు.

- వానాకాలంలో వరి పంట సాగును ముందస్తుగా చేపట్టడం వల్ల అక్టోబర్ మూడో వారం నుంచి నవం బర్ మొదటి వారంలోపు పంట కోసుకోవచ్చు. యాసం గి వరి నారును నవంబర్ 15 నుంచి 20 వరకు సిద్ధం చేసుకుంటే, పంటను మార్చి 3వ వారం నుంచి ఏప్రిల్ మొదటి వారానికల్లా కోసుకోవచ్చు. ఇలా చేయడం వల్ల అకాల, వడగళ్ల వర్షాల నుంచి తప్పించుకోవచ్చు.
- జిల్లాలో 90 శాతం వరకు రైతులు వరి

సాగుకు సూచనలు..

పంటను సాగు చేస్తున్నందున 140 రోజులు అంతకన్నా ఎక్కువ దీర్ఘకాలిక రకాలను మే 25 నుంచి జూన్ 5వ తేదీ వరకు నార్లు పోసుకోవాలి.

- 135 రోజుల పంట కాలం కలిగిన మధ్యకాలిక రకాలు జూన్ 15 వరకు, 120 రోజుల పంట కాలం కలిగిన స్వల్పకాలిక రకాలు జూన్ 25 వరకు నారు పోసుకోవాలి.
- వానాకాలంలో దీర్ఘకాలిక రకాలను సాగు చేయా లనుకునే రైతులు రోహిణి కార్తెలో అంటే ఈనెల చివరి వారంలో నారుపోస్తే మంచి దిగుబడి వస్తాయి. జూన్ మొదటి, రెండవ వారం దాటి నార్లు పోస్తే పూత సమయంలో చలి వలన గొలుసు పూర్తిగా బయటకు రాక గింజ నల్లబడడం, వర్షాల వలన దిగుబడులు తగ్గుతాయి. ఆలస్యంగా నారు పోస్తే ఉల్లి కోడు, అగ్గి తెగులు, ఎండు తెగులు, దోమ పోటు వంటి తెగుళ్లు సోకుతాయి. దీని వలన రైతులకు పెట్టుబడి పెరిగి వాతావరణం అనుకూలించక దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది.
- వానాకాలం పంట కోతను అక్టోబర్ 3వ వారం నుంచి నవంబర్ మొదటి వారంలోపు పూర్తి చేయడం, యాసంగి నారు అనురాధ కార్తెలో సిద్ధం చేసుకోవడం ద్వారా చలి వాతావరణం ఉండదు. యాసంగిలో అను రాధ కార్తెలో అంటే నవంబర్ 20 నుంచి యాసంగి వరి నార్లు పోసుకోవాలి. డిసెంబర్ 2 వరకు పోసుకో వచ్చు. తద్వారా ఏప్రిల్ మొదటి వారంలోపు కోతలు ముగించుకోవచ్చు. మిల్లు పట్టినప్పుడు నూక శాతం తగ్గుతుంది.

ఆకట్టుకున్న గోదావరి కళోత్సవాలు



నృత్యం చేస్తున్న కళాకారులు

కోల్‌సిటీటౌన్, మే 17(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రాంతంలో కళలకు, కళాకారులకు కొదవలేదని, సినీ, టీవీరంగంతోపాటు కళా రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రాంతం నుంచి ఎందరో కళాకారులుగా రాణిస్తున్నారని పలువురు వక్తలు అన్నారు. తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గోదావరి కళాసంఘాల సమాఖ్య వార్షికోత్సవం శనివారం ఆర్‌సీవోఏ క్లబ్‌లో గోదావరి కళోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను సమాఖ్య మాజీ అధ్యక్షుడు జాన్‌సామెల్, ఎస్‌సీ, ఎస్‌టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎలాంటి సౌకర్యాలు లేకున్నా ఎంతో వ్యయప్రయాసాలకోర్చి కళలను, కళారూపాలను ప్రదర్శిస్తున్నారన్నారు. అలాంటి కళలకు, కళాకారులకు కావాల్సిన కళాభవన్ లేకపోవడం బాధాకరమని, ఈ విషయంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చొరవ తీసుకొని కళలను, కళాకారులను ప్రోత్సహించాలన్నారు. వృద్ధ కళాకారులకు పెన్షన్, పేద కళాకారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, భూముల కేటాయింపునకు ఎమ్మెల్యే కృషి చేయాలన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా చేసిన నృత్య కార్యక్రమాలు అలరించాయి. కళా సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కనకం రమణయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దామెర శంకర్, తారా ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపక అధ్యక్షుడు సంకె రాజేష్, కాశిపాక రాజమౌళి, రేణిగుంట్ల రాజమౌళి, దయానర్సింగ్, వాసు, కళాకారులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి సునీత

పెద్దపల్లి టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, ఉపాధ్యాయులు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత అన్నారు. పెద్దపల్లి బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో జడ్జి మాట్లాడారు. పిల్లలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. బాలికలు, బాలురు అనే తేడా లేకుండా చట్టంపై అవగాహన కలిగి ఉంటే నేరాలు జరగకుండా నివారించవచ్చన్నారు. పిల్లలకు జరిగే అన్యాయాలను తల్లిదండ్రులు సంయమనంతో వ్యవహరించి వివరాలు సేకరించాలని సూచించారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను, చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి స్వప్నరాణి, ప్రధానోపాధ్యాయులు అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రామగుండాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దమే లక్ష్యమని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చెప్పారు. శనివారం రాత్రి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.50.5లక్షలతో దుర్గానగర్‌తోపాటు ఏడు చోట్ల నిర్వహించే పార్కుల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు పార్కులు ఎంతో అవసరమని, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని డివిజన్లలో మరిన్ని పార్కులను అందుబాటులోకి తీసుకురానున్నట్టు చెప్పారు. తిలక్‌నగర్‌లో సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్కును ప్రజ లకు అందుబాటులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. కమిషనర్ అరుణశ్రీ మాట్లాడుతూ ప్రజలకు అనువైన వాతావరణం అందించేం దుకు పార్కులను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. నాయకులు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, గుంపుల తిరుపతి, పొలసాని శ్రీనివాస్, దాసరి సాంబమూర్తి, ఉమ, ఈఈ రామన్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



ధూళికట్ట కొనుగోలు కేంద్రంలో డీఆర్‌డీవో

ఎలిగేడు, మే 17 (ఆంధ్రజ్యోతి): ధూళికట్టలో నిర్వహిస్తున్న ఐకేపీ కొనుగోలు కేంద్రాలను శనివారం జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో జాప్యంపై అధికారులను ప్రశ్నించారు. హమాలీ కార్మికులు వ్యవసాయ సీజన్‌లో రైతులకు సహకరించాలని కోరారు. తేమ వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి సంబంధించిన రైస్‌మిల్లులకు పంపించాలన్నారు. రైతులకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. వడ్ల తేమ శాతాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. బుక్స్ వెరిఫికేషన్, రిసీట్స్, డేటా ఎంట్రీ పూర్తిచేయాలన్నారు. అడిషనల్ డీఆర్‌డీవో రవికుమార్, ఏపీఎం సుధాకర్, సీసీ మల్లేశం సిబ్బంది ఉన్నారు.

కన్నాల టోల్‌గేట్ వద్ద వాగ్వాదం

● 40 నిమిషాలపాటు నో టోల్



ఇరువర్గాలను సముదాయిస్తున్న సీఐ

పాలకుర్తి, మే 17(ఆంధ్రజ్యోతి): కన్నాల టోల్‌గేట్ వద్ద శనివారం వాగ్వాదం చోటుచేసుకొంది. దీంతో సుమారు 40 నిమిషాలపాటు ఎలాంటి రుసుము లేకుండా వాహనాలు వెళ్ళిపోయాయి. శాలపల్లికి చెందిన సిరిపురం వెంకటేష్ టోల్‌గేట్ వద్ద డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, అధికారులపై దురుసుగా వ్యవహరించడంతో వెంకటేష్‌ను మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌కు బదిలీ చేశారు. ఈ విషయాన్ని వెంకటేష్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్‌కు తెలుపడంతో కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున టోల్ గేట్ వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్, బసంత్‌నగర్ పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకొని ఇరువర్గాలను సముదాయించి గొడవను సద్దుమణిగించారు. వాగ్వాదం జరుగుతుండగా సిబ్బంది అందరూ అక్కడే ఉండడంతో వాహనాలు రుసుం లేకుండా వెళ్ళిపోయాయి. టోల్‌గేట్ వద్ద సర్వీస్ రోడ్డు నిర్మించాలని, స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు.

మావోయిస్టులతో ప్రభుత్వం చర్చలు జరపాలి



ప్రెస్ క్లబ్‌లో ప్రజా సంఘాల నాయకులు

పెద్దపల్లిటౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరుపాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ ప్రజా సంఘాల నాయకులు కోరారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా 2 వ మహాసభలు జరిగాయి. జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య అధ్యక్షతన, సమన్వయకర్తగా గాండ్ల మల్లేశం వ్యవహరించారు. ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ మంథని సంజీవ రావు, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, తెలంగాణ ప్రజా ఫ్రంట్‌రాష్ట్ర కో కన్వీనర్ బి. రమాదేవి మాట్లాడుతూ సింగరేణి ఓపెన్ కాస్ట్ ల విధ్వంసం, ఇటుక బట్టీలలో ఒడిశా కార్మికుల శ్రమ దోపిడీ, దళితులపై, మైనారిటీ వర్గాలపై దాడులు, రాజ్య హింసకు వ్యతిరేకంగా జిల్లా కమిటీ పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ ను ఎత్తివేయాలని, మావోయిస్టు పార్టీతో శాంతిచర్చలు జరపాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారంలో అన్యాక్రాంతమైన భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలని తీర్మానించారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుమ్మడి కొమురయ్య, ప్రధాన కార్యదర్శిగా పులిపాక రవీందర్, ఉపాధ్యక్షుడిగా గాండ్ల మల్లేశం, సభ్యులుగా రాజు, అంజన్న, సుధాకర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మల్లన్న, బొంకూరి లక్ష్మణ్, బొడ్డుపల్లి రవి, బాలసాని రాజయ్య, మార్వాడి సుదర్శన్, ఎరుకల రాజన్న, జైపాల్ సింగ్, పాల్గొన్నారు.

ఖనిలో కాంగ్రెస్ నాయకుల నిరసన



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

గోదావరిఖని, మే 17(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ దళితుడు అయినందునే ప్రొటోకాల్ పాటించకుండా అవమానపరుస్తున్నారంటూ దేవాదాయశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని శనివారం మున్సిపల్ టీ జంక్షన్ వద్ద కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్లకార్డులతో నిరసన తెలిపారు. రాచకొండ కోటేశ్వర్లు, కామ విజయ్ మాట్లాడుతూ ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రొటోకాల్ పరిధిలోకి రాడా అని వారు ప్రశ్నించారు. దళిత ఎంపీ అయినందనే అవమానపరిచే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని, కాళేశ్వరంలో ప్రారంభమైన సరస్వతీ పుష్కరాలకు ఎంపీని ఆహ్వానించకుండా అవమానపరిచారని, ఫ్లెక్సీల్లో కూడా ఎంపీ ఫొటో పెట్టలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రొటోకాల్ పాటించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నర్సింగ్ దొర, బోయిని మల్లేష్, ముచ్చకుర్తి మహేష్, తిప్పారపు మధు, నరేందర్‌రెడ్డి, రౌతు శ్రీకాంత్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

భూములకు సంజీవిని పచ్చిరొట్ట సాగు

● ఆసక్తి చూపుతున్న రైతాంగం



కొలనూర్ లో పచ్చిరొట్ట ఎరువులపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ జిల్లా అధికారి ఆదిరెడ్డి

ఓదెల, మే 17 (ఆంధ్రజ్యోతి) : విచ్చలవిడిగా రసాయనాల వాడకంతో భూసారం తగ్గిన సాగు భూములకు పచ్చి రొట్ట ఎరువులు ఒక సంజీవినిగా చెప్పవచ్చు. గతంలో సహజ ఎరువుల వాడకంతో ఆరోగ్యానికి హాని కలగని దిగుబడులు తీశారు. ఎరువులు వాడకంతో భూమి, గాలి, నీరు, వాతావరణంలో కలుషితం పెరిగి పోయాయి. భూసారం, ధాన్యం దిగుబడులను పెంచుకునేందుకు ఏకైక మార్గం సహజసిద్ధ ఎరువులు. పచ్చిరొట్ట సాగుతో అన్నింటికీ సురక్షితమని చెప్పవచ్చు. విచ్చలవిడిగా ఎరువులు, పురుగు మందులను వాడితే భూమిలోని సూక్ష్మ పోషకాలు నశించి దిగుబడి పడిపోతుందని వ్యవసాయ శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు.

● పచ్చిరొట్ట రైతులకు అధిక లాభాలు

పచ్చిరొట్ట సాగు వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఉంటున్నాయి. పెసర, జీలుగు, జనుము, పిల్లి పెసర, మినుము, కానుగ, అలసంద విత్తనాలను మే, జూన్ నెలలో పొలం మడికట్లలో చల్లుకొని నీటి సౌకర్యం కల్పించాలి. ఎకరానికి 20 నుంచి 25 కిలోల విత్తనాలు అవసరమవుతున్నాయి. అలాగే పెసర పూత దశకు వచ్చిన తరువాత కాత ప్రారంభంలోనే మడికట్లలో కలియదున్నాలి. భూమిలో మొక్కకు సరిపోయేంత నత్రజని, కాల్షియం, పొటాష్, భాస్వరం, వృద్ధి చెంది మొక్కలకు అందజేస్తుంది. దీంతో యూరియా పొటాష్, డీఏపీ తదితర ఎరువుల అవసరం ఉండదు. ఐదు ఎకరాలకు 60 కిలోల పచ్చిరొట్ట విత్తనాలు చల్లితే ఖర్చులతో కలుపుకొని మొత్తం రూ.12 వేలు ఖర్చు అవుతుంది. అధిక ధరలతో ఎరువులు కొనే అవసరం పడదని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు.

● కలుషితం పై సామూహిక దాడి

వరి నాట్లకు ముందు పెసర, ఉలువ, జీలుగు, నువ్వులు సైతం మడికట్లలో చల్లుకొని కలియ దున్నాలి. పొలం మడికట్లలో పెసర, జీలుగు మొక్కలు మురిగిపోయి భూముల్లో వానపాములు (ఎర్రలు) అధికమై భూసారం పెంచడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. వరినాట్ల సమయం వచ్చే నాటికి భూముల్లో సేంద్రియం, భూసారం పెరుగుతాయి. పెసర, జీలుగు, జనుము, పిల్లి పెసర, అలసంద, మినుము, ఉలువ తదితర పప్పు జాతి విత్తనాలు చౌడు భూముల్లో మినహా అన్ని రకాల స్వభావం ఉన్న నేలలకు సైతం అనుకూలంగా ఉంటాయి. అలాగే హరిత ఎరువులైన కానుగ, వేప ఆకు కూడా భూమి ఉత్పాదాన్ని పెంచడానికి ఉపయోగపడుతుందని శాస్త్రజ్ఞులు పేర్కొంటున్నారు.

● భూములకు, ఆరోగ్యానికి సురక్షితం

సహజ వనరులతో, అలాగే పప్పు జాతి విత్తనాలతో భూసారాన్ని పెంచుకోవడానికి ఉపయోగిస్తే భూములకే కాకుండా రైతుల ఆరోగ్యం, పర్యావరణానికి సురక్షితంగా ఉంటుంది. గాలి, నీరు, కలుషితం కాకుండా ఉంటాయి. పురుగుల మందులు రసాయన ఎరువుల ఉపయోగంతో సారవంతమైన భూములు, మంచి చేసే కీటకాలు, వానపాములు నశించడం వల్ల పంటలో ధాన్యం దిగుబడి తగ్గి రైతాంగం ఆర్థిక నష్టాల్లో కూరుకు పోయే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

● రైతులకు 560 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు

మండలంలోని 22 గ్రామాల రైతులకు 540 క్వింటాళ్ల జీలుగు, 20 క్వింటాళ్ల జనుము విత్తనాలు అవసరమని అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. ప్రస్తుతం ఓదెల, పొత్కపల్లిలోని మూడు డీసీఎంఎస్ కేంద్రాలకు, అలాగే కనగర్తిలోని ఆగ్రోస్ సేవ కేంద్రానికి ఈ విత్తనాలు వస్తున్నాయి. రైతులకు 50 శాతం రాయితీతో అందజేయనున్నారు.

భూముల స్వభావాన్ని మార్చేందుకు రైతులు సిద్ధం కావాలి

\- భాస్కర్ , మండల వ్యవసాయాధికారి ,ఓదెల



భూముల స్వభావాన్ని మార్చుకునేందుకు ప్రతీ రైతు సిద్ధం కావాలి. పచ్చిరొట్ట ఎరువులతో భూములు సారవంతం అవుతాయి, దీంతో రైతుకు అధిక ఖర్చులు తప్పుతాయి. సేంద్రియం వృద్ధి చెంది, వరిలో దిగుబడులు పెరుగుతాయి. దీంతో గ్రామాల్లో స్వచ్ఛమైన వాతావరణం, పర్యావరణ రక్షణ, భూమి, నీటి కాలుష్యం తగ్గిపోయి, ప్రజలు ఆరోగ్యంతో ఎక్కువ కాలం జీవించే అవకాశాలుంటాయి.

భక్తజన సంగమం

- వైభవంగా సరస్వతి పుష్కరాలు
- మూడో రోజు లక్ష మందికిపైగా వచ్చినట్టు అంచనా
- కాళేశ్వరం దారిలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్


పుష్కర ఘాట్ వద్ద భక్తుల రద్దీ


పుష్కరస్నానానికి వస్తున్న భక్తులు

భూపాలపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): త్రివేణి సంగమం.. భక్తజన సంద్రమైంది. సరస్వతి పుష్కరాలకు మూడో రోజు భక్తజనం పోటెత్తారు. వారాంతపు సెలవులు రావడంతో శనివారం భక్తుల సంఖ్య ఊహించని స్థాయిలో పెరిగింది. కాళేశ్వర పరిసరాలు వేలాది వాహనాలతో కిక్కిరిసి పోయాయి. మూడోరోజైన శనివారం లక్ష మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలచరించారు. పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

● అకాల వర్షంతో ఇబ్బందులు

శుక్రవారం అర్ధరాత్రి భారీ వర్షం కురవడంతో కాళేశ్వరం పరిసరాలన్నీ చిత్తడిగా మారి పార్కింగ్ పాయింట్లు నిరుపయోగంగా మారాయి. మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వచ్చే దారిలో సుమారు ఏడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం ఏర్పడింది. అయినప్పటికి భక్తులు కాలినడకన పుష్కరఘాట్లకు చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. పుష్కరఘాట్ సమీపంలో ఏర్పాటు చేసిన టెంట్ సిటీలో కొన్ని గదులు స్వల్పంగా ఒరిగాయి. గాలి తీవ్రతకు భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన టెంట్లు, చలువ పందిళ్లు కూలిపోయాయి. శనివారం ఉదయం నుంచే పుష్కరాలకు వచ్చే భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఈ క్రమంలో మహదేవపూర్-కాళేశ్వరం మధ్యలో సుమారు ఏడు కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఊహించని స్థాయిలో వాహనాలు రావడం, సిబ్బంది అప్రమత్తంగా లేకపోవడం ట్రాఫిక్‌జాంకు కారణమైంది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిన విషయాన్ని తెలుసుకున్న భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు యత్నించారు.

పుష్కరాలకు వీఐపీల తాకిడి..

మూడోరోజు పుష్కరాలకు వీఐపీల తాకిడి పెరిగింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పుణ్యస్నానాలాచరించారు. వీరితో పాటు ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, ఠాకూర్ మక్కాన్ సింగ్ తదితరులు కూడా ఉన్నారు. అంతకుముందు ఉపముఖ్యమంత్రి భట్టి తన సోదరుడితో కలిసి త్రివేణి సంగమం వద్ద తమ పితృదేవతలకు పిండ ప్రధానాలు చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు దగ్గరుండి పుష్కర ఏర్పాట్లను పర్యవేక్షించారని ప్రశంసించారు. మంచి మనసుతో అమ్మవారిని కోరుకుంటే అన్ని సిద్ధిస్తాయని, అమ్మ చల్లని చూపు ప్రజలపై ఉంటుందని, పుష్కర స్నానంతో సకల పాపాలు తొలగుతాయన్నారు. పుష్కరాలకొచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం మంచి సదుపాయాలు కల్పించిందని కితాబిచ్చారు.









ఐటీ రిటర్న్స్‌ను అన్ని కోణాల్లో తనిఖీ చేయాలి

వరంగల్ వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ శశిధరచారి

కరీంనగర్ క్రైం, మే 17(ఆంధ్రజ్యోతి): వ్యాపారులు దాఖలు చేసిన ఐటీ రిటర్న్స్‌ను అన్ని కోణాల్లో తనిఖీ చేసి అసెస్మెంట్ ఆర్డర్ పాస్ చేయాలని వరంగల్ వాణిజ్య పనుల శాఖ జాయింట్ కమిషనర్ శశిధర చారి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జీఎస్టీపై కరీంనగర్ ఉమ్మడి జిల్లా వాణిజ్య పన్నుల శాఖకు సంబంధించిన అసిస్టెంట్ కమిషనర్ స్థాయి నుంచి జూనియర్ అసిస్టెంట్ వరకు జీఎస్టీ అవగాహన సదస్సు శనివారం కరీంనగర్ లోని ఒక హోటల్‌లో నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా వరంగల్ వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ శశిధరచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడిట్ చేసేటప్పుడు వ్యాపారస్తుడు ఎంత వ్యాపారం చేశాడు? ప్రతి నెల దాఖలు చేసిన రిటర్న్స్‌లో సంవత్సరానికి ఎన్ని లక్షల టర్నవర్ చేశాడనేదానికి బట్టి వ్యాపారస్తుని వ్యాపారానికి సంబంధించిన అసెస్మెంట్ ఆర్డర్ పాస్ చేయాలన్నారు. కరీంనగర్ వాణిజ్య పనుల శాఖ జాయింట్ కమిషనర్ కే రవికుమార్ మాట్లాడుతూ వ్యాపారస్తులు గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసిన సందర్భంలో వాణిజ్య పన్నుల శాఖకు సంబంధించిన ఏసీటీఓ అధికారి పూర్తిస్థాయిలో అన్నిరకాల తనిఖీ తర్వాత లైసెన్స్ జారీ చేయాలని అన్నారు.

ఎస్‌యూలో సజావుగా డిగ్రీ పరీక్షలు

గణేశ్‌నగర్, మే 17(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వ విద్యాలయంలో మే 14 నుంచి బీఏ, బీకాం, బీఎస్సీ రెండో, నాలుగో, ఆరో సెమిస్టర్ పరీక్షలు సజావుగా కొనసాగుతున్నాయని విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఉమేష్ కుమార్ తెలిపారు. శనివారం కరీంనగర్ పట్టణంలోని డిగ్రీ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షలు ముగిసిన అనంతరం మూల్యాంకనం త్వరగా చేపట్టి ఫలితాలను సకాలంలో విడుదల చేయాలని పరీక్షల నియంత్రణ అధికారి సురేష్‌కుమార్‌ను ఆదేశించారు.

గుడుంబా పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 17(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలోని జూబ్లీ నగర్‌లో కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ పోలీసులు శనివారం దాడులు చేసి 2 లీటర్ల గుడుంబా పట్టుకున్నారు. సంపంగి రమేష్ వద్ద గుడుంబాతో పాటు 15 కిలోల బెల్లం, 10 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. అనంతరం కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ఎదుట లక్ష రూపాయల పూచీకత్తుపై బైండోవర్ చేశామని పేర్కొన్నారు.

● నగునూర్ గ్రామ పరిధిలో శనివారం బహిరంగ ప్రదేశంలో శనివారం మద్యం తాగుతున్న తిరుపతి, సంపత్, హరికృష్ణను పట్టుకున్నట్లు, ఒక్కొక్కరికి 500 రూపాయలు జరిమానా విధించినట్లు కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ ఎస్సై విజయభాస్కర్ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఎల్లారెడ్డిపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ లో తాళం వేసి ఉన్న ఈరవేణి శివకుమార్ ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు శనివారం చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించిన చోరులు బీరువాను ధ్వంసం చేశారు. వస్తువులను చిందరవందరగా పడేశారు. 15 తులాల బంగారు, 50 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. శివకుమార్ ఉపాధి గల్ఫ్ దేశానికి వలస వెళ్లాడు. అతడి భార్య లతిక పిల్లలతో కలిసి ఉంటోంది. 12 రోజుల క్రితం కామారెడ్డి జిల్లా అంబర్‌పేటలోని పుట్టింటికి వెళ్లింది. చుట్టుపక్కల వారికి ఉదయం ఇంటి తాళం పగలగొట్టి కనిపించడంతో ఆమెకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

ఆటో ఢీకొని వృద్ధుడికి గాయాలు

వీణవంక, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్భాపూర్ గ్రామ శివారులో ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొట్టింది. వీణవంక నుంచి జమ్మికుంట వైపువెళ్తున్న ఆటో ఎదురుగా వస్తున్న టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్రవాహనం నడుపుతున్న కల్వల రాజిరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. రాజిరెడ్డి కూమారుడు సదాశివరెడ్డి ఫిర్యాదు మేరకు ఆటోడ్రైవర్ రజాక్‌పై కేసు నమోదు చేసి నట్టు ప్రొబేషనరీ ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు.

ధర్మపురిలో వృద్ధుడి ఆత్మహత్య

ధర్మపురి, మే 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నది పుష్కరఘాట్ వద్ద కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన రాయిశెట్టి సాయిలు (60) అనే వృద్ధుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రెండు సంవత్సరాల క్రితం చనిపోగా అప్పటి నుంచి తీవ్రమైన మనోవేదనకు గురి అవుతున్నాడు. శుక్రవారం ఇంట్లో నుంచి ధర్మపురికి వచ్చి గోదావరి పుష్కర ఘాట్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఆచూకీ కోసం గాలిస్తున్న కుమారుడు రాయిశెట్టి భిక్షపతి జగిత్యాల ఆస్పత్రిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించి ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని కొడుకుకు అప్పగించినట్టు ఎస్సై ఉదయ్ తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సుభాష్‌నగర్, మే 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని టీఎన్‌జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులు, రిటైర్మెంట్ గ్రాట్యూటీ, పెన్షనరీ బెనిఫిట్స్, హెల్త్‌కార్డులు, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు వంటి సమస్యలు పెండింగిల్‌లో ఉన్నాయన్నారు. 204 సంఘాలతో ఏర్పడిన ఎంప్లాయీస్ జేఏసీ నాయకులతో కలిసి అనేకసార్లు ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చామన్నారు. సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి ఐఏఎస్‌లతో కూడిన త్రీమెన్ కమిటీని నియమించారని, ఆ కమిటీకి జేఏసీ పక్షాన ఆర్థికపరమైన అనేక సమస్యలు వివరించామని అన్నారు. మరో 15 రోజుల్లో కమిటీ ప్రతీ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు ఇస్తున్న జీతభత్యాలు, బోనస్‌లను ఇతర అదనపు బెనిఫిట్స్‌గా పరిగణించకూడదని ముఖ్యమంత్రిని కోరారు. ఉద్యోగుల హక్కులను కాలరాసే విధంగా ఏ ప్రజాప్రతినిధి కూడా మాట్లాడకూడదన్నారు. ప్రజలు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న ఉద్యోగులను దోషులుగా ప్రజల ముందు నిలబెట్టకూడదని, అలాంటి చర్యలు సమంజసం కాదని అన్నారు. ఉద్యోగులను అక్కున చేర్చుకొని వారితో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే విధంగా ప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషించాలన్నారు. ప్రభుత్వమే ఉద్యోగులపై బురదజల్లే ప్రయత్నం చేస్తే ఉద్యోగుల అసహనానికి, అసంతృప్తికి బాధ్యత వహించక తప్పదన్నారు. ఈ సమావేశంలో జిల్లా చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, జేఏసీ కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళీచరణ్, కేంద్ర సంఘం నాయకులు నాగుల నరసింహస్వామి, గూడ ప్రభాకర్‌రెడ్డి, సర్దార్ హర్మిందర్‌సింగ్, జిల్లా కోశాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు ఒంటెల రవీందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేశ్‌భరద్వాజ్, కార్యదర్శి వెలిచాల సుమంత్‌రావు, రూరల్ అధ్యక్షుడు కోడూరి వాస్తవిక్‌గౌడ్, కార్యదర్శి కొమ్మెర శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

వేములవాడలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవి సెలవులు కావడంతో శనివారం ఉదయం నుంచే రాజన్న దర్శనం కోసం భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని తరించారు. అనంతరం రాజన్నకు ఎంతో ఇష్టమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేగంగా వచ్చి డివైడర్‌ను ఢీకొట్టి

● కారులో బెలూన్‌లు తెరుచుకోవడంతో తప్పిన ప్రమాదం


ధ్వంసమైన కారు


ప్రమాదం ధాటికి కూలిన డివైడర్

జగిత్యాల అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో శనివారం సాయంత్రం అతి వేగంగా వచ్చిన కారు డివైడర్‌కు ఢీకొనడంతో డివైడర్ కూలిపోగా కారు ముందు బాగం నుజ్జు నుజ్జు అయింది. కారులోని బెలూన్లు తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. జగిత్యాల రూరల్ ఎంపీఓ, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కన్వీనర్ రవి బాబు కలెక్టర్ కార్యాలయం నుంచి ఇంటికి వెళ్తూ కారు అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొట్టారు. కారులో బెటూన్‌లు ఓపెన్ కావడంతో అతనికి ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డారు.

అదుపుతప్పి బోల్తాపడ్డ కారు.. నలుగురికి స్వల్ప గాయాలు

తిమ్మాపూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ వద్ద శనివారం రాజీవ్‌రహదారిపై కరీంనగర్ వైపు వస్తున్న లారీని ఓవర్‌టెక్ చేయ బోయిన కారు అదుపుతప్పి బోల్తాకొట్టి డివైడర్ దాటి వేరేవైపు పడిపోయింది. కారులో ఉన్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.


బోల్తా పడ్డ కారు

పోలీసుల పేరు చెప్పి లూటీ

- జంటను బెదిరించి డబ్బు లాక్కున్న ఆగంతుకులు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

వేములవాడ, మే 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడకు రాజరాజేశ్వర స్వామి దర్శనం కోసం వచ్చిన ఓ జంటను పోలీసుల పేరిట బెదిరించి డబ్బు లాక్కున్న సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా మంథని సమీపంలోని ఓ గ్రామానికి చెందిన తిరుపతి అనే వ్యక్తి తన స్నేహితురాలితో కలిసి ఈనెల 2వ తేదీన వేములవాడ రాజన్న దర్శించుకునేందుకు వచ్చి ఆలయ సమీపంలో ఉన్న గణేష్ లాడ్జ్‌లో అద్దెకు దిగారు. కొద్దిసేపటి తర్వాత నలుగురు వ్యక్తులు వీరి గదిలోకి బలవంతంగా ప్రవేశించి తాము పోలీసులమని చెప్పి ముగ్గురు లోనికి వెళ్లి ఒకరు బయట ఉండి గడియ పెట్టారు. గదిలోకి ప్రవేశించిన ముగ్గురు వ్యక్తులు జంటను చితక బాదడంతో పాటు మహిళతో అసభ్యంగా ప్రవర్తించినట్లు సమాచారం. పోలీసుల పేరు చెప్పి తిరుపతి ఫోన్ నుంచి 50 వేల రూపాయలు అదే మహిళ అకౌంట్‌కు ఫోన్‌పే చేయించి ఆ వెంటనే ఆమె ఏటీఎం కార్డును, ఇద్దరి సెల్‌ఫోన్‌లను, 25 వేల నగదును కూడా బలవంతంగా లాక్కుని వెళ్లిపోయినట్లు తెలిసింది. ఆ తర్వాత మహిళ ఏటీఎం కార్డు ద్వారా వేములవాడ పట్టణంలోనే మొత్తం ఐదు దఫాలుగా నగదు డ్రా చేశారని బాధితుడు తెలిపాడు. ఈ ఘటనపై బాధితుడు తిరుపతి ఈనెల 14వ తేదీన వేములవాడ పట్టణ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.

విద్యుదాఘాతంతో మాజీ సర్పంచ్ మృతి

సైదాపూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మాజీ సర్పంచ్ కనుకుంట్ల విజయ్‌కుమార్(58) శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయ్‌కుమార్ హనుమాన్ మాల ధరించాడు. శనివారం ఉదయం స్నానం చేసి ఇంటి సమీపంలో దండెం(తీగ)పై బట్టలు ఆరవేస్తుండగా విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దండెం తీగకు విద్యుత్ ప్రసారం కావడంతో ప్రమాదం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


విజయ్ కుమార్(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వేములవాడ టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై రోడ్డు దాటుతున్న సమయంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతిచెందిన సంఘటన వేములవాడ మున్సిపల్ పరిధిలోని నందికమాన్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొలనూరు గ్రామానికి చెందిన కూన తిరుపతి(45) తన ద్విచక్రవాహనంపై వచ్చి కొడుముంజ అర్‌అండ్‌ఆర్ కాలనీలో జరుగుతున్న పెద్దమ్మ ఉత్సవాల్లో పాల్గొని తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఆర్టీసీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో తిరుపతి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గిరిజనుడి ఆత్మహత్యాయత్నం

వీర్నపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఓ గిరిజనుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన వీర్నపల్లి మండలం బాబాయ్ చెరువు తండా లో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన బానోతు సంతోష్ అటవీ ప్రాంతంలో ఇంటి నిర్మాణాన్ని చేపట్టాడు. అటవీ భూముల్లో నిర్మాణాలు చేపట్టడం చట్ట విరుద్ధమని ఫారెస్ట్ బీట్ అధికారి కిరణ్ బేస్ క్యాంప్ సిబ్బందితో అక్కడికి చేరుకొని పనులు అడ్డుకున్నారు. దీంతో మనస్థాపన చెందిన సంతోష్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. స్థానికులు 108కి సమాచారం అందించడంతో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. సంతోష్‌ను ఎస్సై ఎల్లయ్యగౌడ్ ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

దుకాణాల్లో మున్సిపల్ అధికారుల దాడులు

● ప్లాస్టిక్ వస్తువుల స్వాధీనం ● రూ. 23,000 జరిమానా

కోరుట్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని రెస్టారెంట్, హోటల్స్, బేకరీ, టిఫిన్ సెంటర్, ప్లాస్టిక్ ఏజన్సీలలో శనివారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. దుకాణాలు, హోటలలో సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని వారిపై రూ. 23,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ మాట్లాడుతూ సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిషేధించారని, విక్ర యాలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు ఆశోక్, రాజేంద్ర ప్రసాద్, రికార్డు అసిస్టెంట్ జగదీష్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మహేష్, మున్సిపల్ సిబ్బంది రాజు, రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

22న ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న కొత్తపల్లిలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-19 జూనియర్స్ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 28 నుంచి 30 వరకు నల్గొండ జిల్లా నకిరేకల్‌లో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. క్రీడాకారులు జనన ధ్రువపత్రం, పదో తరగతి మెమో, ఒరిజినల్ ఆధార్‌కార్డుతో 22న సాయంత్రం 3 గంటలకు సంయుక్త కార్యదర్శి ఎన్.ప్రభాకర్, పీఈటీ శ్రీధర్‌కు రిపోర్టు చేయాలని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్. 9441925807, 8978995730 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మానవత్వం మరిచిన ఇంటి యజమాని

- ధర్మసత్రంలో ప్రాణం విడిచిన కార్మికుడు
- అంత్యక్రియల కోసం బంధువుల విరాళాలు
- ఆపన్న హస్తం కోసం భార్యపిల్లల వేడుకోలు


నవీన్ మృతదేహం


ఆదుకోవాలని వేడుకుంటున్న మృతుడి భార్య, పిల్లలు

సిరిసిల్ల టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం బారిన పడి మంచానికే పరిమితమైన భవన నిర్మాణ కార్మికుడి కుటుంబాన్ని ఇంటి యజమాని ఇల్లు ఖాళీ చేయించాడు. దాదాపు నెల రోజుల పాటు అనారోగ్యంతో బాధపడుతూ భవన నిర్మాణ కార్మికుడు వెంగళ నవీన్ (35) శనివారం ధర్మసత్రంలో మరణించాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... సిరిసిల్ల పట్టణానికి చెందిన వెంగళ నవీన్ నెహ్రూనగర్‌లో అద్దెకు ఉంటూ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. నవీన్‌కు భార్య సరిత, కూతుర్లు అక్షయ(14), ఐశ్వర్య(12), వైశాలి (10) ఉన్నారు. కూలీ పనిచేస్తుండగా నవీన్ ఎడమ కాలుకు గాయమైంది. ఏప్రిల్ 15న నవీన్ నడవలేక పడిపోవడంతో కుటుంబ సభ్యులు సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా పరీక్షలు చేసిన వైద్యులు కాలి గాయంతో శరీరంలోని ఆర్గాన్స్ ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యాయని, ఇంటికి తీసుకెళ్లమని చెప్పారు. నవీన్‌ను సిరిసిల్లకు తీసుకరాగా అద్దె ఇంటి యజమాని ఖాళీ చేయించడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. దీంతో సిరిసిల్ల నెహ్రూనగర్ అంబాభవాని దేవాలయం చైర్మన్ చిలుక నారాయణ దేవాలయంకు చెందిన ధర్మసత్రంలో ఆశ్రయం కల్పించాడు. దాదాపు నెల రోజుల పాటు మృత్యువుతో పోరాడిన నవీన్ శనివారం మృతి చెందాడు. అంతిమ సంస్కారాలు నిర్వహించ డానికి ఆ కుటుంబం వద్ద చిల్లిగవ్వ లేకపోవడంతో బంధువులు సేకరించిన విరాళాలతో రాత్రి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన ఆ కుటుంబం ఆపన్న హస్తం అందించాలని వేడుకుంటోంది.

పాక్‌కు సైనిక రహస్యాలు

(మొదటి పేజీ తరువాయి)


జ్యోతి మల్హోత్రా

అక్కడి ఎలక్ట్రానిక్ సెన్సార్లను చిత్రీకరించి వాట్సాప్, టెలిగ్రామ్‌ల ద్వారా పాక్ ఏజెంట్లకు చేరవేసిందని పేర్కొన్నారు. ఈ కేసులో జ్యోతి మల్హోత్రాని శనివారం అరెస్టు చేయగా న్యాయస్థానం ఐదు రోజుల రిమాండ్ విధించింది.

ఇలా పట్టేశారు...

చిత్రీకరించిన సైనికపరంగా సున్నితమైన వీడియోల ఫుటేజీ మొత్తాన్ని ఆమె వెంటనే పాక్ హై కమిషన్ కార్యాలయం నుంచి భారత్ బహిష్కరించిన ఉద్యోగి అహ్‌సాన్ ఉర్ రహీమ్ అలియాస్ డానిష్ నంబరుకు పంపిస్తోందని హరియాణా-పంజాబ్ సైబర్ సెల్ పోలీసులు గుర్తించారు. పోలీసులు అరెస్టు చేసిన మరో ఐదుగురి వద్దా ఆ నెంబరును గుర్తించారు. 'ఆపరేషన్ గోస్ట్ సిమ్' పేరిట చేసిన పరిశోధనలో వీరందరిని గుర్తించి అధికారిక రహస్యాలు అక్రమంగా చేరవేసిన కేసులో అరెస్టు చేశారు.

ఇఫ్తార్ విందులో...

మల్హోత్రా గత ఏడాది మార్చిలో పోస్టు చేసిన ఓ వీడియోలో ఢిల్లీలోని పాక్ హై కమిషన్ కార్యాలయంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం కనిపిస్తోంది. ఇందులో అక్కడి ఏర్పాట్లను ఆమె ఎంతో మెచ్చుకున్నారు. పాకిస్థాన్ మరెన్నోసార్లు వెళ్లాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. పాక్ హై కమిషన్ ఉద్యోగి డానిష్‌తో సంభాషిస్తూ ఆమె ఆ వీడియోలో కనిపించారు. గతంలో తాము కలుసుకున్న సందర్భాలనూ ప్రస్తావించారు. అతడి భార్యతోనూ చనువుగా మాట్లాడారు. సాధారణ పరిచయాన్ని మించిన సన్నిహితత్వం వారి మధ్య కనిపించింది. కాగా జ్యోతి మల్హోత్రాతో పాటు మరో ఇద్దరు మహిళలు, ముగ్గురు యువకులను హరియాణా పోలీసులు ఈ కేసులో అరెస్టు చేశారు. వీరి నెట్‌వర్క్ హరియాణా, పంజాబ్ రాష్ట్రాలతోపాటు ఉత్తర భారతమంతా విస్తరించినట్లు భావిస్తున్నారు. 'ట్రావెల్ విత్ జో' పేరిట యూట్యూబ్ చానల్ నడుపుతోన్న జ్యోతి మల్హోత్రా 2023లో పాకిస్థాన్‌కు వెళ్లింది. ఆ సమయంలో ఢిల్లీలోని పాకిస్థాన్ హై కమిషన్ కార్యాలయంలో పనిచేసే డానిష్ ఆమెకు పరిచయమయ్యాడు. ఇతడు జ్యోతికి పలువురు పాకిస్థాన్ ఏజెంట్లను పరిచయం చేశాడు. వాట్సాప్, టెలిగ్రామ్, స్నాప్‌చాట్‌ల ద్వారా జ్యోతి వారితో టచ్‌లో ఉంది. షకీర్ అలియాస్ రాణా షహబాజ్ అనే పాక్ ఏజెంట్ వారిలో ఒకడు. అతడి నంబరును జాట్ రణ్‌ధావా పేరుతో జ్యోతి సేవ్ చేసుకుంది. సామాజిక మాధ్యమాల్లో పాక్ గురించి మంచిగా ప్రచారం చేసేందుకు ఈమెను ఉపయోగించుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఒక పాక్ ఏజెంట్‌కు బాగా దగ్గరయిన జ్యోతి అతడితో ఇండోనేషియా పర్యటనకూ వెళ్లింది. కాగా డానిష్‌ను ఈ నెల 13న కేంద్రం అవాంఛనీయ వ్యక్తిగా ప్రకటించి దేశం విడిచి వెళ్లాల్సిందిగా ఆదేశించింది. జ్యోతితో పాటు పంజాబ్‌లోని మలేర్‌కోట్లకు చెందిన మరో వితంతు మహిళ గుజాల(32) కూడా ఈ కేసులో కీలక నిందితురాలు. వీసా కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో పాక్ హై కమిషన్ కార్యాలయానికి వెళ్లిన ఆమెకు డానిష్ పరిచయమయ్యాడు. అతడితో తరచూ మాట్లాడుతూ ఉండేది. పెళ్లి చేసుకుంటానని డానిష్ ఆమెకు దగ్గర అయ్యాడు. ఏప్రిల్ 23న గుజాల మలేర్‌కోట్లకే చెందిన వితంతు మహిళ బాను నస్రీనను పాక్ హై కమిషన్ కార్యాలయానికి తీసుకువెళ్లగా డానిష్ ఆమెకు మరుసటి రోజే పాక్ వీసా ఇప్పించాడు. కాగా ఈ కేసులో అరెస్టయిన మరో ముగ్గురు వ్యక్తులు మలేర్‌కోట్లకు చెందిన యమీన్ మహమ్మద్, పటియాలలోని ఖల్సా కళాశాల విద్యార్థి దేవిందర్ సింగ్ ధిల్లాన్, నుహ్‌కు చెందిన అర్మాన్. యమీన్ డానిష్‌తో కలిసి ఆర్థిక, వీసా జారీ వ్యవహారాలు నడిపాడు. ధిల్లాన్ మే 12న తన ఫేస్‌బుక్ ఖాతాలో గన్, పిస్టల్ చిత్రాలను పోస్టు చేశాడు. దీంతో అతడిని అరెస్టు చేసిన పోలీసులు పలు కీలక వివరాలు రాబట్టారు. గత ఏడాది నవంబరులో కర్తార్‌పూర్ కారిడార్ ద్వారా పాక్ వెళ్లిన అతడు అక్కడ ఐఎస్ఐ ఏజెంట్లకు భారత్‌కు సంబంధించిన సున్నిత సమాచారాన్ని అందజేశానని వెల్లడించాడు. అందుకు తనకు పెద్దమొత్తంలో డబ్బు ముట్టిందని చెప్పాడు. పటియాల కంటోన్మెంట్ వీడియోలూ ఇతడు పాక్‌కు పంపినట్లు గుర్తించారు. అర్మాన్ సిమ్ కార్డులు సమకూర్చడం, డబ్బు పంపిణీ వ్యవహారాలు చేశాడు. అంతేగాక పాక్ ఏజెంట్ల సూచనల మేరకు డిఫెన్స్ ఎక్స్‌పో-2025ని కూడా సందర్శించాడు. కాగా నిందితులంతా తమ నేరాలను అంగీకరించారు. పాక్ ఏజెంట్లు సమాజంలో మతపరంగా, సామాజికంగా సున్నిత మనస్తత్వం గలవారిని గుర్తించి డబ్బు, ప్రేమ, పెళ్లి పేరిట వలలో వేసుకుంటున్నారని పోలీసులు తెలిపారు.

పాలస్తీనా ప్రజలంతా లిబియాకు?

వాషింగ్టన్, మే 17: ఇజ్రాయెల్ దాడుల్లో కకావికలమైన గాజా ప్రాంతం నుంచి పాలస్తీనీయులను ఖాళీ చేయించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. సుమారు పది లక్షల మంది పాలస్తీనా ప్రజలను శాశ్వతంగా లిబియాకు తరలించనున్నట్టుగా అమెరికా అధికార వర్గాలను ఉటంకిస్తూ.. ఎన్‌బీసీ న్యూస్ కథనాన్ని ప్రచురించింది. దీనికి సంబంధించి లిబియా ప్రభుత్వంతో అమెరికా సీనియర్ అధికారులు చర్చలు జరుపుతున్నారని పేర్కొంది. పాలస్తీనా ప్రజల తరలింపునకు బదులుగా అమెరికా ఫ్రీజ్ చేసిన వేల కోట్ల రూపాయల లిబియా నిధులను విడుదల చేస్తామని ప్రతిపాదించినట్టు తెలిపింది. పూర్తిగా విధ్వంసమైన గాజా పరిస్థితి ఏమీ బాగోలేదని, ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని, వారిని ఖాళీ చేయించి.. దానిని స్వేచ్ఛా ప్రాంతం(ఫ్రీడమ్ జోన్)గా అభివృద్ధి చేస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతంలోనే ప్రకటించడం గమనార్హం. మరోవైపు పాలస్తీనా తమ మాతృభూమి అని, దాన్ని రక్షించుకునేందుకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని పాలస్తీనా హమాస్ సీనియర్ అధికారి బసెమ్ స్పష్టం చేశారు. లిబియాలో సుమారు 14 ఏళ్ల క్రితం అంతర్యుద్ధం చెలరేగింది. అప్పటి నుంచీ ఆ దేశంలో పరిస్థితి అస్తవ్యస్తంగానే ఉంది. లిబియా పశ్చిమ ప్రాంతంలో అబ్దుల్ హమీద్ నేతృత్వంలో, తూర్పు ప్రాంతంలో ఖలీఫా హఫ్తార్ నేతృత్వంలో పాలన కొనసాగుతోంది. మొత్తం దేశంపై పట్టు కోసం ఈ రెండు వర్గాల మధ్య అంతర్యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇదిలా ఉండగా, ఆపరేషన్ 'గిడియాన్స్ చారియట్స్' పేరుతో ఇజ్రాయెల్ శనివారం గాజాపై విరుచుకుపడింది. ఈ దాడుల్లో 100 మంది మరణించారు. గాజా భూభాగంలో యుద్ధాన్ని ఉధృతం చేయడంలో భాగంగా అపహరణకు గురైనవారి విడుదలతో పాటు హమాస్‌ను ఓడించడం వంటి లక్ష్యాలను సాధించడానికే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు ఇజ్రాయెల్ సైన్యం 'టెలిగ్రాం'లో పోస్టు చేసింది.

ట్రంప్ నోట మళ్లీ జీరో టారిఫ్ మాట!



న్యూయార్క్, మే 17: భారత సుంకాల విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి అక్కసు వెళ్లగక్కారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 100 శాతం సుంకాలను తగ్గించుకోవడానికి భారత్ సిద్ధంగా ఉందంటూ మళ్లీ మొదటికొచ్చారు. ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం కోసం తానేమి తొందరపడటం లేదని చెప్పారు. తాజాగా ఓ న్యూస్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. 'ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి. వారు వ్యాపారాలు చేయడాన్ని దాదాపు అసాధ్యం చేస్తున్నారు. ప్రతీకార సుంకాల నేపథ్యంలో అమెరికాకు 100% సుంకాలు తగ్గించుకునేందు (జీరో టారిఫ్‌ల) కు సిద్ధంగా ఉన్నారు. ఆ దేశంతో త్వరలోనే వాణిజ్య ఒప్పందం అమల్లోకి రానుంది. ఈ విషయంలో నాకేం తొందరలేదు. మాతో ఒప్పందానికి చాలా దేశాలు ముందుకొస్తున్నాయి. అందరితో ఒప్పందాలంటే మా వల్ల కాదు. ప్రస్తుతం భారత్‌తో చర్చలు జరుగుతున్నాయి' అంటూ వ్యాఖ్యానించారు. ఇదివరకు ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలే చేయగా.. భారత్ తోసిపుచ్చింది.

'నీట్' ఫలితాల విడుదలపై మద్రాస్ హైకోర్టు స్టే

చెన్నై, మే 17(ఆంధ్రజ్యోతి): 'నీట్' ఫలితాల విడుదలపై మద్రాసు హైకోర్టు స్టే విధించింది. దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర యూజీ వైద్య కోర్సులకు మే 4న నీట్‌ను నిర్వహించారు. పరీక్ష జరుగుతున్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందిపడిన తమకు మళ్లీ పరీక్ష నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయాలంటూ తిరువళ్లూర్, రాణిపేట జిల్లాలకు చెందిన 13మంది విద్యార్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలను విచారించిన మద్రాసు హైకోర్టు... ఫలితాల విడుదలపై స్టే విధించింది.

మా ఎయిర్‌బేస్‌లను భారత్ దెబ్బతీసింది



నూర్‌ఖాన్ వైమానిక స్థావరంపై దాడి చేసింది

- తొలిసారి అంగీకరించిన దాయాది దేశం
- దాడుల విషయం ఆర్మీచీఫ్ అర్ధరాత్రి తెలిపారు
- ధ్రువీకరించిన ప్రధాని షెహబాజ్ షరీఫ్

న్యూఢిల్లీ, మే 17 : ఆపరేషన్ సిందూర్ దెబ్బ బలంగా తగిలిన విషయం ఎట్టకేలకు దాయాది దేశం అంగీకరించింది. తమ వైమానిక స్థావరాలపై భారత్ దాడులు జరిపిందని పాకిస్థాన్ తొలిసారి ఒప్పుకొంది. రావల్పిండిలోని నూర్‌ఖాన్ సహా పలు ప్రాంతాల్లోని ఎయిర్‌బేస్‌లపై ఈ దాడులు జరిగాయని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ స్వయంగా ధ్రువీకరించారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలు, ఎయిర్‌బేస్‌లపై విరుచుకుపడిన విషయం తెలిసిందే. తమ ఎయిర్‌బేస్‌లు లక్ష్యంగా దాడులు జరిగినట్టు ఈ నెల 10వ తేదీ తెల్లవారుజామున, 2.30 గంటలకు, ఆర్మీ చీఫ్ మునీర్ ఫోన్‌చేసి తనకు తెలిపారని షెహబాజ్ వివరించారు. ఆయన ప్రకటనకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఆ వీడియోను అనుసరించి.. ప్రధాని షరీఫ్ శుక్రవారం రాత్రి ఓ కార్యక్రమంలో మాట్లాడారు. భారత క్షిపణులు తమ లక్ష్యాన్ని చేరుకున్నాయని ఆయన అంగీకరించారని పాకిస్థాన్‌కు చెందిన జియో న్యూస్‌ను ఉటంకిస్తూ ఏఎన్‌ఐ వార్తాసంస్థ తెలిపింది. భారత్ దాడులను ఎదుర్కొనేందుకు స్వదేశీ సాంకేతికతతోపాటు చైనా తయారీ జెట్లను వైమానిక దళం ఉపయోగించిందని తెలిపారు. కాగా, పాక్ ప్రధాని వ్యాఖ్యల వీడియోను బీజేపీ నేత అమిత్ మాలవీయా 'ఎక్స్'లో పంచుకున్నారు. "నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ సహా ఇతర స్థావరాలను భారత్ పేల్చివేసిందని స్వయంగా పాకిస్థాన్ అంగీకరించింది. పాక్‌లో బాగా లోపలకు చొచ్చుకెళ్లి మనం జరిపిన క్షిపణి దాడుల వార్తలతో అర్ధరాత్రి ప్రధాని షెహబాజ్ షరీఫ్ నిద్రలేశారు. ఆపరేషన్ సిందూర్ విధ్వంస విస్తృతి ఏ స్థాయిలో ఉన్నదనేది ఇది తెలియజేస్తోంది" అని ఆయన తెలిపారు.

లోకం తీరు



తుర్కియేకు అమెరికా 'సైడ్ విండర్' క్షిపణులు

న్యూఢిల్లీ, మే 17 : తుర్కియేకు 304 మిలియన్ డాలర్ల విలువైన క్షిపణులను విక్రయించే ఒప్పందానికి ఇటీవల ఆమోదం తెలిపిన అమెరికా.. ఆ ఒప్పందంలో భాగంగా 60 ఏఐఎం-9ఎక్స్ సైడ్ విండర్ క్షిపణులను సరఫరా చేయనుంది. స్వల్ప శ్రేణి ఎయిర్ టు ఎయిర్ క్షిపణి అయిన సైడ్ విండర్‌ను ఎఫ్-16వీ యుద్ధ విమానాల్లో వినియోగించవచ్చు. గగనతలంలో యుద్ధ విమానాల మధ్య జరిగే పోరులో ఈ సైడ్ విండర్ క్షిపణులు అత్యంత ప్రభావం చూపుతాయి. తుర్కియే ఇటీవల 40 ఎఫ్-16వీ విమానాలను సమకూర్చుకోగా.. ఈ సైడ్ విండర్‌లతో ఆ దేశ వాయుసేన మరింత బలోపేతం కానుంది. అయితే, భారత్‌కు వ్యతిరేకంగా ఇటీవల పాకిస్థాన్‌కు డ్రోన్లు, క్షిపణులు అందజేసిన తుర్కియే.. ఈ సైడ్‌విండర్‌లను కూడా పాక్‌కు ఇచ్చే ప్రమాదం ఉంది.

బ్రహ్మోస్ క్షిపణుల కోసం మరో 20 సుఖోయ్ విమానాల అప్‌గ్రేడ్

న్యూఢిల్లీ, మే 17: పాకిస్తాన్, చైనాలకు కంటి మీద నిద్ర లేకుండా చేసేందుకు మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నది. ఆపరేషన్ సిందూర్‌లో పాక్ వెన్ను విరవడంలో బ్రహ్మోస్ క్షిపణులు కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో బ్రహ్మోస్-ఏ క్షిపణులను మోసుకెళ్లేందుకు వీలుగా మరో 20 సుఖోయ్ యుద్ధ విమానాలను అప్‌గ్రేడ్ చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో బ్రహ్మోస్-ఏ క్షిపణులను మోసుకెళ్లే సామర్థ్యం గల సుఖోయ్ యుద్ధ విమానాల సంఖ్య 60కి చేరుకుంది. ఈ బాధ్యతను హెచ్ఏఎల్‌కి అప్పగించారు. ప్రస్తుతం 2.5-టన్నుల బ్రహ్మోస్-ఎ క్షిపణిని సుఖోయ్ విమానం మోసుకెళ్లగలుగుతుంది. ఇక నుంచి 2.8 టన్నుల బ్రహ్మోస్-ఎ క్షిపణిని 400 కి.మీలకు పైగా దూరంలోని లక్ష్యాన్ని ఢీకొట్టేలా సుఖోయ్ విమానాలను అభివృద్ధి చేస్తారు.

కాంగ్రెస్‌ను కాదని థరూర్‌కు పట్టం

(మొదటి పేజీ తరువాయి)

మా పార్టీ అధ్యక్షుడు ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీని.. అఖిలపక్షం బృందాలకు పేర్లను పంపాలని కోరారు. కేంద్ర మాజీ మంత్రి ఆనంద్ శర్మ, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్, రాజ్యసభ ఎంపీ సయ్యద్ నాసిర్ హుస్సేన్, లోక్‌సభ ఎంపీ రాజా బ్రార్ పేర్లను రాహుల్‌గాంధీ ప్రతిపాదించారు. కేంద్రం మాత్రం ఏకపక్షంగా శశిథరూర్ పేరును ప్రకటించింది. దీన్ని బట్టి, ముందుగానే పేర్లను నిర్ణయించుకుని, నామమాత్రంగా ఖర్గే, రాహుల్‌ను పేర్లివ్వాలని అడిగారని స్పష్టమవుతోంది" అని వ్యాఖ్యానించారు. ట్రంప్ మధ్యవర్తిత్వ ప్రకటనపై మోదీ మౌనం వీడడం లేదని ఎద్దేవా చేశారు.


థరూర్, రవిశంకర్, బైజయంత్, సంజయ్‌కుమార్ ఝా, కనిమొళి, సుప్రియా సూలే, శ్రీకాంత్ శిందే

ఆ ఏడుగురు ఎంపీలు వీరే..

ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించబోమనే సందేశాన్ని ఐక్య రాజ్య సమితి(ఐరాస) భద్రతామండలిలోని సభ్య దేశాలతోపాటు.. ఇతర ప్రధాన భాగస్వామ్య దేశాలకు వివరించేందుకు కేంద్ర ప్రభుత్వం శనివారం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. ఒక్కో బృందంలో ఆరేడుగురు ఎంపీలతో పాటు.. సీనియర్ దౌత్యవేత్తలు, మాజీ రాయబారులుంటారు. ఈ బృందాలకు.. ఏడుగురు ఎంపీలు నేతృత్వం వహిస్తారు. వీరిలో నలుగురు అధికార ఎన్డీయే కూటమి, మరో ముగ్గురు విపక్ష ఇండియా కూటమి పార్టీల పార్లమెంట్ సభ్యులు. ఈ జాబితాలో శశిథరూర్(కాంగ్రెస్), రవిశంకర్‌ప్రసాద్(బీజేపీ), బైజయంత్ పాండా(బీజేపీ), సంజయ్‌కుమార్ ఝా(జేడీయూ), కనిమొళి(డీఎంకే), సుప్రియా సూలే(ఎన్‌సీపీ-శరద్‌పవార్), శ్రీకాంత్ శిందే(శివసేన) ఉన్నారు. ఈ నెల 22 తర్వాత ఈ బృందాలు విదేశాలలో పర్యటించే అవకాశాలున్నాయి. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది చనిపోవడం, పాక్‌పై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాదంపై ఈ బృందాలు విదేశాలలో ప్రచారం చేస్తాయి.

పీవీ బాటలో మోదీ!

దౌత్య యుద్ధంపై మాజీ ప్రధాని పీవీ బాటనే ఇప్పుడు మోదీ ఎంచుకున్నట్లు తెలుస్తోంది. 1994లో కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందంటూ పాకిస్థాన్ దుష్ప్రచారం చేసింది. జెనీవాలోని ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల కమిషన్‌లో తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. దాంతో పీవీ అప్పటి విపక్ష నేత వాజ్‌పేయి నేతృత్వంలో ఓ ప్రతినిధి బృందాన్ని జెనీవాకు పంపించారు. ఆ బృందంలో అప్పటి జమ్మూకశ్మీర్ సీఎం ఫరూక్ అబ్దుల్లా, సల్మాన్ ఖుర్షీద్, హమీద్ అన్సారీ ఉన్నారు. వీరి దౌత్య నీతితో పాక్ ప్రవేశపెట్టిన తీర్మానం వీగిపోయింది. 2008లో కూడా ముంబై ఉగ్రదాడుల్లో పాక్ ప్రమేయముందనే సందేశాన్ని ప్రపంచదేశాలకు అందించేందుకు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ బృందాలను పంపారు. ఇప్పుడు మోదీ కూడా.. పాక్ కుతంత్రాలపై ప్రపంచానికి వివరించే ప్రయత్నం చేస్తున్నారు.

డీ4 వ్యవస్థ కోసం బీఈఎల్, ఆర్మీ మధ్య ఒప్పందం

డ్రోన్ దాడులను సమర్థవంతంగా అడ్డుకునేందుకు దోహదపడే ఇంటిగ్రేటెడ్ డ్రోన్ డిటెక్షన్ అండ్ ఇంటర్‌డిక్షన్ సిస్టమ్ (ఐడీడీఐఎస్ లేదా డీ4)కు సంబంధించి భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్), భారత ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ శుక్రవారం ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ వ్యవస్థను మేక్ ఇన్ ఇండియాలో భాగంగా డీఆర్‌డీవో, బీఈఎల్‌లు సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. శత్రు డ్రోన్లను గుర్తించడంతోపాటు ట్రాక్ చేయడం, ధ్వంసం చేయడానికి ఐడీడీఐఎస్‌ను అభివృద్ధి చేశారు. ఇది గగనతల ముప్పుల నుంచి రక్షణ కల్పించడంలో కీలకంగా మారుతోంది. గత ఏప్రిల్ 7 తర్వాతి నుంచి అదనంగా రూ.572 కోట్ల విలువైన ఆర్డర్లను పొందినట్టు బీఈఎల్ వెల్లడించింది. సంస్థ పొందిన ప్రధాన ఆర్డర్లలో ఐడీడీఐఎస్‌తో పాటు సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియో(ఎస్‌డీఆర్), జామర్లు, విడిభాగాలు వంటివి ఉన్నాయి.

రాష్ట్రపతికి గడువు.. కేంద్రమే పెట్టింది!



2016లో రెండు మెమోలు జారీ చేసిన కేంద్ర హోంశాఖ

- రాష్ట్రాల బిల్లుల మీద 3 నెలల్లోపు ఆమోదం తెలుపాలని రాష్ట్రపతికి సూచన
- ఆ మెమోలనే ప్రస్తావించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మే 17: రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించి పంపిన బిల్లుల మీద గవర్నర్లు, రాష్ట్రపతి నిర్ణీత గడువులోపు ఆమోదముద్ర వేయాలని పేర్కొంటూ సుప్రీంకోర్టు తీర్పునివ్వటం మీద రాష్ట్రపతి తాజాగా ఆక్షేపణ తెలిపిన విషయం తెలిసిందే. అయితే, బిల్లుల ఆమోదం గడువు విషయంలో సుప్రీంకోర్టు కొత్తగా ఏమీ చెప్పలేదని, కేంద్రప్రభుత్వం గతంలో స్వయంగా విడుదల చేసిన కొన్ని అధికారిక ఉత్తర్వులనే ప్రస్తావించి, వాటిని అమలు చేయాలని నిర్దేశించిందని తాజాగా వెల్లడైంది. ప్రభుత్వ నిర్ణయాల్లో జాప్యాన్ని నివారించటం కోసం.. బిల్లులను రాష్ట్రపతి మూడు నెలల్లోపు ఆమోదించాలని సూచిస్తూ కేంద్ర హోంశాఖ 2016లో రెండు మెమోలు జారీ చేసింది. తీర్పును వెలువరించిన సందర్భంగా జస్టిస్ జేబీ పార్దివాలా వీటి గురించి ప్రస్తావిస్తూ.. 'గవర్నర్ సిఫార్సు మేరకు అందిన బిల్లుల మీద మూడు నెలల్లోపు రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర హోంశాఖ పేర్కొన్న గడువు సముచితమైనదేనని భావిస్తున్నాం' అని స్పష్టం చేశారు. ఈ మేరకు 2016 ఫిబ్రవరి 4వ తేదీన కేంద్ర హోంశాఖ జారీ చేసిన తొలి మెమోను సుప్రీంకోర్టు తన తీర్పులో ఉదహరించింది. 'స్పష్టమైన నిబంధనలున్నప్పటికీ, రాష్ట్రాల బిల్లులకు సంబంధించి అనవసర జాప్యం జరుగుతోంది. దీనిని నివారించటానికి, రాష్ట్రాల నుంచి బిల్లు అందిన మూడు నెలల్లోపు తుది నిర్ణయం తీసుకోవాలి. దీనిని కచ్చితంగా పాటించాలి' అని ఈ మెమో స్పష్టంగా పేర్కొనటం గమనార్హం. అంతేకాదు, రాష్ట్రాల నుంచి వచ్చిన బిల్లులలోని అంశాల ఆధారంగా సదరు బిల్లులను సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖలకు పంపటంలో కేంద్రహోంశాఖ మధ్యవర్తిగా వ్యవహరిస్తుందని, బిల్లులోని భాష, పదాల కూర్పు, రాజ్యాంగపరమైన ఆమోదాన్ని కలిగి ఉందా? అన్నవాటిని పరిశీలించటానికి కేంద్ర న్యాయ శాఖకు పంపాలని ఆ మెమో పేర్కొంది. బిల్లును అందుకున్న మంత్రిత్వశాఖ 15 రోజుల్లోపు తన స్పందన హోంశాఖకు తెలియజేయాలని, జాప్యం జరిగితే అందుకు కారణాలు తెలపాలని స్పష్టం చేసింది. నెలలోపు ఎటువంటి స్పందన లేకపోతే, సదరు శాఖకు ఆ బిల్లు మీద అభ్యంతరాలు లేవని భావించాలని తెలిపింది.

నెలలోపు రాష్ట్రాలు వివరణ ఇవ్వాలి

2016 ఫిబ్రవరి 4వ తేదీనే కేంద్రహోంశాఖ జారీ చేసిన రెండో మెమోను కూడా సుప్రీంకోర్టు తన తీర్పులో ఉదహరించింది. బిల్లు మీద సంబంధిత కేంద్ర మంత్రిత్వశాఖకు ఏమైనా అభ్యంతరాలున్నా, మరిన్ని వివరాలు కావాలని భావించినా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు కచ్చితంగా తెలియజేయాలని, రాష్ట్ర ప్రభుత్వాలు నెలలోపు వివరణ ఇవ్వాలని ఈ మెమో పేర్కొంది. నిర్ణయాత్మక ప్రక్రియలో ఉన్న వివిధ భాగస్వాములకు గడువు విధించటం అనేది.. రాజ్యాంగ విధులను నిర్దేశించే ఆర్టికల్ 201కు ఏ రకంగానూ విరుద్ధం కాదని జస్టిస్ పార్దివాలా స్పష్టం చేశారు. ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి పరిశీలనకు గవర్నర్ పంపిన బిల్లులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని గతంలో వచ్చిన సర్కారియా, పూంఛీ కమిషన్లు చేసిన సిఫార్సులకు తగినట్లుగానే 2016లో కేంద్రం జారీ చేసిన మెమోలు ఉన్నాయని నిపుణులు గుర్తు చేస్తున్నారు.

నేడు నింగిలోకి నిఘా నేత్రం

- పీఎస్‌ఎల్వీ-సీ61 రాకెట్ ద్వారా ఈవోఎస్-09 ఉపగ్రహ ప్రయోగం

సూళ్లూరుపేట, మే 17(ఆంధ్రజ్యోతి): సరిహద్దుల్లో నిరంతర నిఘా కోసం ఉద్దేశించిన ఈవోఎస్-09 (రీశాట్-1బీ) ఉపగ్రహాన్ని పీఎస్‌ఎల్వీ-సీ 61 రాకెట్ నేడు నింగిలోకి మోసుకెళ్లనుంది. తిరుపతి జిల్లాలోని శ్రీహరికోట షార్ అంతరిక్ష కేంద్రం నుంచి ఆదివారం ఉదయం 5.59 గంటలకు ఈ ప్రయోగం జరగనుంది. శనివారం ఉదయం 7.59 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించారు. 22 గంటల పాటు ఈ కౌంట్‌డౌన్ కొనసాగుతుంది. ఒకటో ప్రయోగ వేదిక నుంచి పీఎస్‌ఎల్వీ-సీ 61 రాకెట్ అంతరిక్షంలోకి దూసుకెళ్లనుంది. కాగా, రాకెట్‌లో ద్రవ ఇంధనం, హీలియం, నైట్రోజన్ గ్యాస్‌ను నింపే కార్యక్రమాన్ని శాస్త్రవేత్తలు పూర్తిచేశారు. ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ శుక్రవారం రాత్రి షార్‌కు చేరుకొని ప్రయోగ వేదిక పైనున్న పీఎస్‌ఎల్వీ-సీ 61 రాకెట్‌ను పరిశీలించారు. రీశాట్-1బీ ఉపగ్రహం బరువు 1,696.24 కిలోలు. దేశ భద్రత, సైనిక అవసరాల కోసం దీన్ని ప్రయోగిస్తున్నారు. భారత్‌కు ఇప్పటికే అంతరిక్షంలో 50కి పైగా ఉపగ్రహాలు ఉన్నాయి. ఈ రాడార్ ఇమేజింగ్ శాటిలైట్ వాటితో జత కలవనుంది. ఇప్పటికే కార్టోశాట్-1 ఉపగ్రహం లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లో తిరుగుతూ చిత్రాలు అందిస్తోంది. అయితే అది రాత్రివేళల్లో ప్రతికూల వాతావరణంలో ఉపయోగపడటం లేదు. తాజాగా పీఎస్‌ఎల్వీ-సీ 61 రాకెట్ ద్వారా ప్రయోగించే ఈవోఎస్-09 ఉపగ్రహంలో అమర్చిన సీ-బ్యాండ్ సింథటిక్ ఎపర్చర్ రాడార్ ద్వారా ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా అధిక రెజల్యూషన్‌తో కూడిన భూ ఉపరితల చిత్రాలు లభిస్తాయి.

ఐదేళ్ల దాకా సేవలు

ఈ ఉపగ్రహం ఐదేళ్ల సేవలందించనుంది. పాకిస్థాన్‌తో పాటు చైనా సరిహద్దుల్లోని సున్నిత ప్రదేశాలపై ఈ ఉపగ్రహం కన్ను ఉంటుంది. దేశ సరిహద్దు రక్షణే కాకుండా వ్యవసాయం, అటవీ, భూగర్భం, ప్రకృతి వైపరీత్యాలపై ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తుంది. రీశాట్-1బీ ఉపగ్రహం కక్ష్యలోకి చేరిన 101 నిమిషాల తరువాత తన పని ప్రారంభిస్తుంది.



ముంబైలో ఇద్దరు ఐఎస్ సభ్యుల అరెస్ట్

న్యూఢిల్లీ, మే 17: ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ఉగ్ర సంస్థకు చెందిన నిద్రాణ దళాల(స్లీపర్ మాడ్యూల్)తో సంబంధం ఉన్న ఇద్దరు వ్యక్తులను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అరెస్ట్ చేసింది. అబ్దుల్లా ఫయాజ్ షేక్ అలియాస్ డైపర్‌వాలా, తల్హా ఖాన్ 2023లో మహారాష్ట్రలోని పుణెలో ఐఈడీ తయారీ, పరీక్షలకు సంబంధించిన కేసులో నిందితులు. రెండేళ్లుగా తప్పించుకు తిరుగుతున్నారు. వీరిపై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. వీరి సమాచారం ఇచ్చిన వారికి ఎన్ఐఏ రూ.3 లక్షల చొప్పున నగదు బహుమతిని ప్రకటించింది. తాజాగా వీరిద్దరూ ఇండోనేషియా రాజధాని జకర్తాలో తలదాచుకుంటున్నట్లు సమాచారం అందుకున్న ఎన్ఐఏ.. బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ సాయంతో అరెస్టు చేసింది. ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎన్ఐఏ వీరిని అదుపులోకి తీసుకుంది.

జన్యువును మార్చి.. మృత్యువును ఏమార్చి!

- అమెరికాలో 7 నెలల చిన్నారికి అరుదైన 'జన్యు సవరణ' చికిత్స
- భారత సంతతి వైద్యుడు కిరణ్ ముసునూరు కీలకపాత్ర


కిరణ్ అండ్ రెబెక్కా

వాషింగ్టన్, మే 17: అమెరికాలోని పెన్సిల్వేనియాకు చెందిన చిన్నారి కేజే మల్డూన్. పుట్టుకతోనే ఏదో అనారోగ్యం. పరీక్షలు చేసిన వైద్యులు 'సీపీఎస్ 1'గా పిలిచే అరుదైన జన్యులోపంగా గుర్తించారు. సగటున ప్రతి 13 లక్షల మందిలో ఒకరికి మాత్రమే వచ్చే సమస్య. ఇలా పుట్టిన చిన్నారుల్లో చాలా మంది కొన్ని నెలల్లోనే చనిపోతారు. ఒకవేళ బతికినా మానసిక, శారీరక ఎదుగుదల సరిగా ఉండక.. జీవచ్ఛవంలా బతకాల్సిందే. లక్షల మందిలో ఒకరికి వచ్చే సమస్య కాబట్టి.. దీనిపై పెద్ద స్థాయిలో పరిశోధనలు, ఔషధాల తయారీ వంటివేవీ లేవు. కానీ.. అమెరికా వైద్య నిపుణులు అత్యంత అరుదైన జన్యు సమస్యకు.. అంతే వినూత్నమైన 'జన్యు సవరణ (జీన్ ఎడిటింగ్)' చికిత్స చేసి కేజే ప్రాణాలు నిలబెట్టారు. జన్యుమార్పిడి చికిత్సల్లో ఉపయోగించే క్రిస్పర్ విధానం సాయంతో.. ఆ చిన్నారిలోని జన్యువులోని రసాయనాల అమరికలో ఉన్న లోపాన్ని సవరించారు. ఇలా 'ఓ వ్యక్తిలోని జన్యులోపాన్ని వారికే ప్రత్యేకించిన (పర్సనలైజ్డ్/ కస్టమైజ్డ్ జీన్ ఎడిటింగ్ థెరపీ) చికిత్స'తో నయం చేయడం ప్రపంచంలో ఇదే మొదటిసారి.

సరికొత్త విధానంలో రూపొందించి..

కేజే పుట్టిన రెండు వారాలకే అతడి కాలేయ కణాల్లోని ఓ జన్యువులో లోపాన్ని వైద్యులు గుర్తించారు. జీవక్రియల్లో భాగంగా మన శరీరంలో ఉత్పత్తయ్యే అమ్మోనియా, ఇతర విష పదార్థాలను నిర్వీర్యం చేసే ఎంజైమ్‌ను కాలేయం ఉత్పత్తి చేయడానికి ఆ జన్యువే కీలకం. దానిలో లోపం వల్ల ఆ ఎంజైమ్ సరిగా ఉత్పత్తిగాక.. శరీరంలో విష పదార్థాలు పేరుకుపోయి.. మెదడు దెబ్బతింటుంది. కోమాలోకి వెళ్లిపోయి, చనిపోయే ప్రమాదం ఉంటుంది. దీనిపై ఫిలడెల్ఫియా పిల్లల ఆస్పత్రి నిపుణురాలు రెబెక్కా ఆర్లెన్స్ నిక్లాస్, పెన్సిల్వేనియా యూనివర్సిటీ వైద్య నిపుణుడు, భారత సంతతికి చెందిన కిరణ్ ముసునూరు బృందం ఫోకస్ చేసింది. వినూత్నమైన ప్రయోగాత్మక చికిత్స చేసేందుకు కేజే తల్లిదండ్రులు నికోల్, కైల్‌లను ఒప్పించింది. కణాల్లోని జన్యువులను కత్తిరించి.. ఏదైనా భాగాన్ని తొలగించడానికి, అవసరమైతే అతికించడానికి వీలయ్యే 'క్రిస్పర్ కాస్9' విధానాన్ని వినియోగించింది. కేజే కాలేయ కణాలను సేకరించి పరిశోధన చేసింది. అతడి కాలేయ కణాల్లోకి చొచ్చుకెళ్లి.. లోపం ఉన్న జన్యుభాగాన్ని మార్చేలా ఆదేశాలు ఇచ్చే పదార్థాన్ని రూపొందించింది. ఇందుకోసం సుమారు ఆరు నెలల సమయం పట్టింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో కేజే (అప్పటికి ఏడు నెలల వయసు)కు దానితో చికిత్స చేసింది. రెండు నెలల పాటు పూర్తిగా పర్యవేక్షణ చేసి, చికిత్స విజయవంతమైందని తేల్చింది. ఇప్పుడు కేజే పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్టు ప్రకటించింది. జన్యుపరమైన సమస్యలతో బాధపడుతున్నవారికి ప్రత్యేకించిన చికిత్సలు చేసేందుకు ఈ ప్రయోగం మార్గం సుగమం చేసిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ముందస్తు సాగుపై దృష్టి

(5వ పేజీ తరువాయి)

కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ నెలలో ముందస్తు పంటల సాగు వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని నిర్ణయించారు. రైతువేదికల్లో రైతులతో సమావేశాలు నిర్వ హించి ముందస్తు పంటల సాగు గురించి వివరించ డంతోపాటు కరపత్రాల ద్వారా ప్రచారం చేయాలని భావిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా వానాకాలం సీజ న్‌లో వరి, పత్తి, మొక్కజొన్న పంటలు, యాసంగిలో వరి, మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఆశించిన మేరకు వర్షాలు కురిసి ఎస్సారెస్పీ, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, చెరువులు, కుంటలు నిండితే వానాకాలంలో 2 లక్షల 70 వేలు, యాసంగి సీజన్‌లో 2 లక్షల 10 వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి.

● వానాకాలం సీజన్‌లో సాగు

వానాకాలం సీజన్‌లో 2,72,678 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖాధికా రులు అంచనా వేశారు. ఇందులో 2,12,500 ఎకరాల్లో వరి, 705 ఎకరాల్లో మొక్కజొన్న, 5 ఎకరాల్లో పెసర, 5 ఎకరాల్లో మినుము, 250 ఎకరాల్లో కంది, 10 ఎకరాల్లో వేరుశెనగ, 5 ఎకరాల్లో నువ్వులు, 52,500 ఎకరాల్లో పత్తి, 10,086 ఎకరాల్లో మిర్చి, పసుపు, ఆయిల్ పామ్, కూరగాయలు సాగవుతాయని వ్యవసాయ శాఖాధికా రులు పేర్కొన్నారు. అయితే ఈ పంటలను సకాలంలో సాగు చేస్తేనే అధిక దిగుబడులు వస్తాయని, ప్రకృతి వైపరీత్యాల బారి నుంచి కాపాడుకున్న వాళ్లవుతారని అధికారులు సూచిస్తున్నారు.

మదర్‌థెరిస్సా కళాశాలకు ప్రత్యేక గుర్తింపు

- సీఎం చేతులమీదుగా ఎంవోయు పత్రం



సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఎంవోయు పత్రాన్ని అందుకుంటున్న కళాశాల డైరెక్టర్ నవత

పెద్దపల్లి రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): పెద్దబొంకూరులోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు అందించింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మదర్‌థెరిస్సా కళాశాల డైరెక్టర్ ఎడవెల్లి నవతకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంవోయూ పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ నవత మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న కోర్సులు స్కిల్ డెవలప్‌మెంట్‌తో పాటు ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా నాణ్యమైన బోధన అందిస్తున్నందుకు తెలంగాణ ప్రభుత్వం గుర్తించి ఎంవోయూ పత్రాన్ని అందించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

పెద్దపల్లి రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీవో వేణుగోపాల్ అన్నారు. శనివారం భోజన్నపేటలో పర్యటించారు. గ్రామంలో పారిశుధ్యం, పరిశుభ్రతపై కార్యదర్శి శైలజను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ గ్రామాల్లో చేపడుతున్న ప్రతీ పనిని రికార్డు చేయాలని, దోమల బెడద లేకుండా ఫాగింగ్ చేయించాలని సూచించారు. డంపింగ్ యార్డులో తయారు చేసిన వర్మీకంపోస్టును పరిశీలించారు. వర్మీ కంపోస్టును అవసరం ఉన్న రైతులకు విక్రయించాలని సూచించారు. కారోబార్ మల్లేశంలతో పాటు సిబ్బంది ఉన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం

సుల్తానాబాద్, మే 17: (ఆంధ్రజ్యోతి): వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం హన్‌మాన్ మాలధారణ స్వాములకు అన్నదానం చేశారు. హన్‌మాన్ పెద్ద జయంతికి ముందు ఆలయంలో యేటా స్వాములకు అన్నదానం నిర్వహిస్తారు. శనివారం గాదం వినయ్, కిష్టయ్య, కనుకమ్మ కుటుంబ సభ్యులు స్వాములకు అన్నదానం నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు భజనలు చేశారు. మాజీ జడ్పీటీసీ ఐల రమేష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, కొప్పూరి వెంకటస్వామి, కొయ్యడ రమాకాంత్, పోడేటి వెంకటేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ వైరు తగిలి గేదె మృతి

పెద్దపల్లి రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంపల్లి గ్రామ పంచాయతీ పరిధి మేరపల్లిలో విద్యుత్ వైరు తగిలి గేదె మృతి చెందింది. బాధితుడు బొయిని ఎల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం గేదె మేత కోసం పంట పొలాల వైపు వెళ్లగా రెండు రోజుల క్రితం వీచిన గాలికి విద్యుత్ వైర్లు తెగి కిందపడ్డాయి. తెగిన వైరుకు గేదె తగలడంతో మృతి చెందిందని తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతు ఎల్లయ్య డిమాండ్ చేశారు.

సబ్సిడీపై రైతులకు జీలుగ విత్తనాలు

మంథని, మే 17 (ఆంధ్రజ్యోతి): రైతుల కోసం మంథని రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్టే (జీలుగ) విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏడీఏ అంజని శనివారం తెలిపారు. కిలో జీలుగ విత్తనాలు రూ.142.50గాను 50శాతం సబ్సిడీపై రూ.71.25కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. 30 కిలోల జీలుగ విత్తనాల బస్తాలు అందుబాటులో ఉన్నాయని రూ.2,137 కొనుగోలు చేసుకోవాలని రైతులకు సూచించారు. 30 కిలో బస్తా రెండున్నర ఎకరాలకు సరిపోతుందన్నారు. వివరాలకు ఏవోను సంప్రదించాలన్నారు.

విద్యార్థికి సన్మానం

మంథని, మే 17 (ఆంధ్రజ్యోతి): మలేషియాలో జరిగిన కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించిన మెట్టు హాసినిని కాంగ్రెస్ నేత గోటికార్ కిషన్‌జీ ఆధ్వర్యంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు క్యాంపు కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ నేతలు సన్మానించారు. ఆర్‌టీఏ మెంబర్ మంథని సురేష్, నేతలు గుండా రాజు, బండారి ప్రసాద్, మోహన్, అజీం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుర్మవాడలో వెలగని విద్యుత్‌దీపాలు

పెద్దపల్లి రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కుర్మవాడలో విద్యుత్ దీపాలు లేక చీకటిమయంగా మారింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు రెండు రోజుల క్రితం వీచిన గాలి దుమారానికి విద్యుత్ దీపాలు దెబ్బతినట్లు పేర్కొన్నారు. అధికారులు స్పందించి దీపాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కార్యదర్శుల పై చర్యలు తీసుకోవాలి

మంథనిరూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): గోపాల్‌పూర్ గ్రామ పంచాయతీకి సంబంధించిన నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో బాధ్యులైన పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు గోపాల్‌పూర్ మాజీ సర్పంచ్ చంద్రు రాజమల్లు శనివారం తెలిపారు. గోపాల్‌పూర్ గ్రామ పంచాయతీకి సంబంధించి 2019 నుంచి 2023 వరకు రూ. 75 లక్షల అవినీతి జరిగిందని గతంలో ఫిర్యాదు చేశామన్నారు. దీని పై అధికారులు స్పందించి గతంలో పని చేసిన నలుగురు కార్యదర్శుల్లో ప్రవీణ్‌కుమార్ అనే కార్యదర్శి పైనే చర్యలు తీసుకున్నారన్నారు. మిగితా ముగ్గురు కార్యదర్శులు సదయ్య, భాగ్యలక్ష్మి, సతీష్‌లు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, వారిపై చర్యలు తీసుకోవడం తోపాటు నిధుల రికవరీ చేయాలని కోరారు.

నేటి నుంచి చిన్నకలువలలో బ్రహ్మోత్సవాలు



ముస్తాబైన చిన్నకలువల అంజనేయస్వామి ఆలయం

సుల్తానాబాద్, మే 17: (ఆంధ్రజ్యోతి): చిన్నకలువలలోని సంకట విమోచన రామభక్త వీర ఆంజనేయ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. యేటా ఈ ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. తెలంగాణాలోని పలు జిల్లాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భక్తులు పాల్గొంటారు. హుస్సేనిమియా వాగు ఆనుకుని వెలసిన స్వామి భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారంగా ప్రసిద్ధి. యేటా వైశాఖ బహుళ షష్టి రోజన బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. భక్తుల కోసం చలువ పందిళ్ళు వేయించారు. ప్రత్యేక యాగశాలలు నిర్మించారు. భక్తులకు తాగునీటి వసతితో పాటు అన్నదానం నిర్వహిస్తారు. ఈ నెల 18న ఆదివారం సాయంత్రం ఆధ్యయనోత్సవాలతో బ్రహ్మోత్సవాలను ప్రారంభించనున్నారు. 19న ఉదయం ప్రబంధ పారాయణం, తీర్థప్రసాద గోష్టి, ఈ నెల 20న యాగశాల ప్రవేశఘట్టం ఉంటుంది. అదే రోజు సాయంత్రం సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవం వందలాది మంది భక్తులు వీక్షిస్తుండగా వేత పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహిస్తారు. ఈ నెల 21న సీతారామ చంద్ర స్వామి పట్టాభిషేకం నిర్వహిస్తారు. సాయంకాలం సదస్యము, బలిహ రణము ఉంటాయి. హన్‌మాన్ జయంతి ఉత్స వాలను పురస్కరించుకుని ఈ నెల 22న ఆలయంలో జయంతి వేడుకలు నిర్వహిస్తారు.

బ్రహ్మోత్సవాలు భక్తులకు ప్రత్యేక పండుగని ఉత్సవ నిర్వాహకులు వంగపల్లి సుగుణాకర్ రావు అన్నారు. వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నాం.

కొండపాక సత్యనారాయణ యాజ్ఞికులు మాట్లాడుతూ ఆలయంలో 108 ప్రదక్షిణములు చేస్తే కోరిన కోరికలు నెరవేరబడతాయన్నారు. రావి చెట్టుకు ప్రదిక్షణము చేసి 11 రోజులు దీక్షగా నాగదేవత పూజ చేస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని పేర్కొన్నారు.

ప్రజలందరిని ఏకం చేసే తిరంగా యాత్ర



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జుల

పెద్దపల్లిటౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి) దేశ రక్షణ కోసం ప్రతీ ఒక్కరు సైనికులం అవుతామని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తిరంగాయాత్ర ఉగ్రవాదుల దాడి అనంతరం దేశ ప్రజలందరూ ఒక్కటై సైనికుల వెంట నిలవడటం గర్వంగా ఉందన్నారు. ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తూ ప్రజల ప్రాణాలను తీయాలని చూస్తున్న పాకిస్థాన్‌కు మన సైనికులు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఈ నెల 23న పెద్దపల్లి పట్టణంలో తిరంగా యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కులసంఘాలు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాశిపేట లింగయ్య, వెల్లంపల్లి శ్రీనివాసరావు, రాంసిగ్, పల్లె సదానందం, పర్శ సమ్మయ్య, శివంగారి సతీష్, పహీం, తదితరులున్నారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి

గోదావరిఖని, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రొటోకాల్ పాటించని పెద్దపల్లి, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కలెక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఎస్‌సీ, ఎస్‌టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, ఎస్‌సీ, ఎస్‌టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య, సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణకు శనివారం ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరంలో నిర్వహిస్తున్న సరస్వతీ పుష్కరాలకు ఎంపీని ఆహ్వానించకపోగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఫ్లెక్సీలలో ఎంపీ ఫొటో పెట్టకుండా అవమానపరిచారని, దీనిని ఖండిస్తున్నట్టు చెప్పారు. మాల సామాజిక వర్గానికి చెందిన ఎంపీపై వివక్షత చూపు తున్నారని, దీనిపై విచారణ చేసి కలెక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దేవాదాయశాఖ అధికారులు ఎంపీని ఆహ్వానించకపోవడం కుల వివక్షతేనన్నారు. దేవాదాయశాఖ అధికారులపై కేసు నమోదు చేయాలని చీఫ్ సెక్రటరీకి, డీజీపీకి సిఫార్సు చేసినట్టు ఆయన చెప్పారు.

నేలమట్టమైన భవనం

కోల్‌సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్ వద్ద రాజీవ్ రహదారి పక్కన సర్వీస్ రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న భవనాన్ని శనివారం నేలమట్టం చేశారు. రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి భవనం కూల్చివేతలు ప్రారంభించారు. శనివారం భారీ యంత్రం తీసుకువచ్చి భవనాన్ని తొలగించారు. స్థానికంగా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక వైపు రహదారిని మూసివేశారు. రాత్రి వరకు నిర్మాణ వ్యర్థాలను తొలగిస్తున్నారు. వన్‌వేలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. సర్వీస్ రోడ్డు నిర్మాణానికి బస్టాండ్ వద్ద నిర్మాణాన్ని తొలగించడం చర్చనీయాంశమైంది.

ఈదురుగాలులతో వర్షం

కళ్యాణ్‌నగర్, మే 17(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. మూడు రోజుల క్రితం భానుడి భగభగతో మండిన రామగుండం మంగళవారం కురిసిన భారీ వర్షంతో చల్లబడింది. మంగళవారం అర్ధరాత్రి 2.5సెంటీ మీటర్ల వర్షపాతం, శుక్రవారం అర్ధరాత్రి 1సెంటీ మీటర్ వర్షపాతం నమోదైంది. వర్షాలతో రోడ్లన్నీ జలమయమయ్యాయి.

జూలపల్లి : మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలులో వేగం పెంచకపోవడంతో కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోయింది. టార్పాలిన్లు లేకపోవడంతో ధాన్యం తడిసిపోయింది. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్నా ఇబ్బందులను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమ్మె వాయిదా నిరాశ పరిచింది

గోదావరిఖని, మే 17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను జాతీయ కార్మిక సంఘాలు వాయిదా వేయడం కార్మికులను నిరాశ పరిచిందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ, కార్యదర్శి ఏ వెంకన్న అన్నారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వానికి కార్మికవర్గంపై జరుగుతున్న దాడులకు మరింత బలాన్ని చేకూరుస్తాయని, సరిహద్దుల్లో కాల్పుల విరమణ జరిగి సాధారణ పరిస్థితులు నెలకొన్నా సమ్మెను ఎందుకు వాయిదా వేశారని ప్రశ్నించారు. అఖిల భారత స్థాయిలో జరిగిన సమావేశానికి ఐఎఫ్‌టీయూను ఆహ్వానించకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకోవడాన్ని ఐఎఫ్‌టీయూ ఖండిస్తుందన్నారు. మే 20న కార్మికులు పని స్థలాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు నరేష్, శంకర్, అశోక్, రాజేశం, కొమురయ్య, రవికుమార్, లింగయ్య, సాంబయ్య, పోచయ్య, సారయ్య పాల్గొన్నారు.

ఆరోగ్యసూత్రాలు పాటిస్తూ బీపీని అదుపులో ఉంచుకోవాలి



గ్రామస్థులకు వివరిస్తున్న వైద్యబృందం

సుల్తానాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ బీపీని అదుపులో ఉంచుకోవాలని గర్రెపల్లి పీహెచ్‌సీ డాక్టర్ ఉదయ్‌కుమార్ ప్రజలకు సూచించారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది ఉద్యోగులు గ్రామస్థులు కలిసి గ్రామంలో రక్తపోటు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉప్పు తగ్గించుకోవాలన్నారు. నిత్యం వ్యాయామం చేయాలన్నారు. హెచ్‌ఈఓ ఎండి అనీసొద్దిన్, భారతి, ఎలిజెబెత్ రాణి, డోలో రోజా పాల్గొన్నారు. కనుకుల సబ్‌సెంటర్‌లో కూడా రక్తపోటు దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉపాధిహామీ కూలీలకు బీపీ నివారణకు తగిన జాగ్రత్తలు వివరించారు. ఏఎన్‌ఎం తార, రవళి తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రపంచ అధిక రక్తపోటు నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది గ్రామస్థులతో కలిసి అంబేడ్కర్‌చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆహారంలో ఉప్పు తగ్గించుకోవాలని, తగిన వ్యాయామం చేయాలని పీహెచ్‌సీ వైద్యులు నిస్సిక్రిష్టాన తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీలు వినయ, సింధూర, సూపర్‌వైజర్లు లక్ష్మణ్, నాగమణి, పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): ఇప్పలపల్లె గ్రామంతోపాటు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామస్థులకు అధికరక్తపోటుపై వైద్యబృందం అవ గాహన కల్పించారు. అధికంగా ఉప్పు వాడ రాదని, మద్యపానం, ధూమపానం చేయరాదని, రోజు వ్యాయామం చేయాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీ సర్ సరస్వతి, హెచ్‌ఈఓ శ్రీనివాస్, వినీత్, పీహెచ్ ఎస్ భాగ్యలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ నీరజ, ఏఎన్‌ఎం సరోజన గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

కళ్యాణ్‌నగర్, మే 17(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరుపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో మావోయిస్టులను లేకుండా చేయడానికి కేంద్ర ప్రభుత్వం 26వేల మంది కేంద్ర బలగాలతో ఛత్తీస్‌గఢ్ కర్రెగుట్టల్లో ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తుందని, వెంటనే ఆపరేషన్‌ను నిలిపివేయాలని, బేషరతుగా మావోయిస్టులతో చర్చలు జరుపాలని డిమాండ్‌చేశారు. కేంద్ర బలగాలను అమాయక గిరిజనులను పొట్టన పెట్టుకుంటుందని, వారిని వేధిస్తుందన్నారు. మూడవ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. జమ్ముకాశ్మీర్‌లోని పహల్‌గావ్‌లో జరిగిన మారణహోమం బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే జరిగింది. జూన్ 15న జిల్లా కేంద్రంలో సీపీఐ మహాసభలను నిర్వహించనున్నట్టు, వంద సంవత్సరాల చరిత్ర కలిగిన సీపీఐని కార్మికులు, కర్షకులు, ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. సీపీఐ నాయకులు కనకరాజు, గౌతం గోవర్దన్, గోషిక మోహన్, తాళ్లపల్లి మల్లయ్య, రేణికుంట్ల ప్రీతం, చంద్రశేఖర్, అబ్దుల్ కరీం, తొడుపునూరి రమేష్, ఓదమ్మ, రమ, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు అర్థరహితం

పెద్దపల్లి రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే విజయరమణారావుపై ఆరోపణలు అర్థరహితమని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. అప్పన్నపేట కొనుగోలు కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరె సంతోష్ మాట్లాడుతూ బిజేపి నాయకులు గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి రైతుల వద్దకు వెళ్లి ఎమ్మెల్యే గురించి తెలుసుకోవాలన్నారు. రైతుల కోసం ఎవరు అహర్నిశలు కృషి చేస్తున్నారో తెలుసుకోని మాట్లాడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షానికి ధాన్యం తడిసిన కూడ వెనువెంటనే రైతులు నష్టపోకుండా కొనుగోలు జరిగేలా పెద్దపల్లి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారన్నారు.

గన్నమననేని తిరుపతిరావు, జడల రాజు, తమ్మనవేని శ్రీనివాస్, మెండ రవి, రాపెల్లి సంతోష్, అనుమాల మహేష్ పాల్గొన్నారు.

సన్నవడ్లకు బోనస్ చెల్లించాలి

కాల్వశ్రీరాంపూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): రైతుల ఖాతాల్లో 48గంటల్లోగా సన్నవడ్లకు బోనస్‌తో పాటు డబ్బులను జమచేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గూడెపు జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం మంగపేటలో కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలు పడి వరి ధాన్యం తడిసే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం త్వరితగతిన ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలన్నారు. రోహిణి కార్తే ప్రారంభంలోగా కొనుగోలు పూర్తిచేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయాలన్నారు. ఎండి.రఫీ, ముల్కోజు వెంకన్న, సల్పాల బాలకృష్ణ, కిరణ్‌రెడ్డి, శ్రీనివాస్, మహేంద్రాచారి, తదితరులు పాల్గొన్నారు.

విషాహారం తిని మృతి చెందుతున్న గొర్రెలు



మృతి చెందిన గొర్రెలు

ధర్మారం, మే 17 (ఆంధ్రజ్యోతి): బొమ్మరెడ్డిపల్లిలో విషాహారం తిని గొర్రెలు మృత్యువాతపడుతున్నాయి. గ్రామంలోని కొమ్ము రాజేశం, కొమ్ము కనుకయ్య, సమ్మెట కొమురయ్య, దాడి నాగరాజు, రేషవేణి మల్లేశంలకు చెందిన దాదాపు 600 గొర్రెలను బుధవారం గ్రామ శివారులో మేతకు తీసుకెళ్లారు. అదే ప్రాంతంలో అప్పుడే కోసిన ఓ పొలంలో మేతకు వదిలినట్లు తెలిపారు. గురువారం తెల్లవారుజామున నాలుగు గొర్రెలు చనిపోయాయని కొమ్ము రాజేశం తెలిపారు. ఆందోళనకు గురైన వారు ఓ వెటర్నరీ మెడికల్ షాప్‌లో విషయం చెప్పగా వారిచ్చిన మందులు పోశారు. అయినప్పటికీ శుక్రవారం దాదాపు 12 గొర్రెలు చనిపోయాయి. దీంతో ఆందోళనకు గురైన యజమానులు వెటర్నరీ డాక్టర్ అజయ్‌కి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చెరుకున్న డాక్టర్ అజయ్ గొర్రెలకు చికిత్స అందించారు. అస్వస్థతకు గురై రెండు రోజులు గడవడంతో గొర్రెలు మృత్యువాత పడుతున్నాయి. పొలంలో ఏదైన విషాహారం తిని ఉంటాయని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కాగా, మృతి చెందిన గొర్రెలను సమీప గ్రామంలోని ప్రజలు తినడానికి తీసుకెళ్తనట్లు కాపరులు తెలిపారు. గొర్రెలు విషం తిని చనిపోయినట్టుగా అనుమానం కలుగుతుండడంతో ప్రజలకు కూడా హాని కలిగే అవకాశం లేకపోలేదని డాక్టర్ తెలిపారు.

ఆలస్యంగా సమాచారం

వెటర్నరీ డాక్టర్ అజయ్య



గొర్రెలు చనిపోతున్న విషయం రెండు రోజుల తరువాత తెలిపారు. గురువారం సమాచారం ఇస్తే పరిస్థితి వేరుగా ఉండేది. విషాహారం తిని 48 గంటలు దాటడంతో చికిత్స అందించినప్పటికి ఇంకా మృతిచెందే అవకాశం ఉంది. చనిపోయిన గొర్రెల మాంసం తినడం మంచిది కాదు.

నాగేపల్లి ప్రజల ఇబ్బందుల పై అదనపు కలెక్టర్‌కు వినతి

రామగిరి, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపల్లి ప్రభావిత ప్రాంతానికి చెందిన ప్రజా సమస్యల పై పిఆర్ ఫౌండేషన్ ఫర్ సొసైటి ఎండీ శ్రీనివాస్(న్యాయవాది) అదనపు కలెక్టర్ వేణుకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఓసిపి-2 ప్రాజెక్టు అనుకొని ఉన్న సింగరేణి ప్రభావిత ప్రాంతంలోని నాగేపల్లి సి-బ్లాక్‌లో ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యల పై వినతి పత్రం అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్‌లు చేయడం మూలంగా గృహలు దెబ్బతిన్నాయని వినతిలో పేర్కోన్నారు. దీంతో పాటుగా గ్రామంలో పారిశుధ్య పనులు, కొతుల సంచారం అదికంగా ఉందని వీటి ద్వార స్థానికులు సమస్యలు ఎదుర్కోంటున్నట్లు స్థానికంగా పంచాయితి సెక్రటరీకి ఫిర్యాదు చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు.

వ్యవసాయ రంగం ఆధునీకరణ వైపు అడుగులు

ఎలిగేడు, మే 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వ్యవసాయ రంగం ఆధునీకరణ వైపు పయనిస్తుందని మండల వ్యవసాయశాఖ అధికారి ఉమాపతి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో వారం రోజుల నుండి ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ భూమి ఉన్న రైతు భూమి వివరాలను సంబంధించిన ఏవోలు నిర్వహించే కార్యక్రమానికి హాజరై నమోదు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయడానికి రైతుకు 11నంబర్లతో కూడిన విశిష్ట సంఖ్య కేటాయించడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పథకాలు దాని ద్వారా అమలవుతాయని పేర్కొన్నారు. రైతులు ఆధార్‌నంబర్, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ లింక్ మొబైల్ నంబర్ అవసరమని అన్నారు. రైతులు సత్వరమే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఆయనతో పాటు ఏఈఓ సురేష్, గణేష్ తదితరులు ఉన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జీఎంలు

రామగిరి, మే 17(ఆంధ్రజ్యోతి): నిత్యం వ్యాయామంతోనే ఆరోగ్యంగా ఉంటారని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్క రించుకొని శనివారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ ఒక్కరు నిర్ణీత కాలంలో వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆహార అలవాట్లు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. రోజు 30 నిమిషాలపాటు వ్యాయామం చేయాలని, పోషక విలువలు కల్గిన ఆహారం తీసుకోవాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఏపిఏ జీఎం నాగేశ్వర్‌రావు, సత్యనారాయణ, శ్రీనివాసులు, రామ్మోహన్, చంద్రశేఖర్, సుదర్శనం, నాగేశ్వర్‌రావు, సుధాకర్, ఐలయ్య, డాక్టర్ రామకృష్ణ, నాయకులు సంతోష్‌కుమార్, కోటరవీందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

సీహెచ్‌పీలో కార్మికుడికి గాయాలు



యైటింక్లయిన్‌కాలనీ, మే 17(ఆంధ్రజ్యోతి): కాలుతున్న బొగ్గు మీద పడడంతో ఓసీపీ-3 సీహెచ్‌పీలో శనివారం కార్మికుడు గాయపడ్డాడు. సీటూ ఫీడర్ వద్ద బ్యాక్ వాటర్ కొడుతున్న బొల్లి సురేష్‌పై డంపర్ బొగ్గును అన్‌లోడ్ చేసింది. డంపర్‌లో కాలు తున్న బొగ్గు సురేష్‌పై పడడంతో మెడపై భాగం కాలింది. ఇరవై రోజుల క్రితం ఇదే విధంగా ఫైర్‌కోల్ మీద పడి ఓకార్మికుడు గాయపడ్డాడు. క్వారీలో నుండి కాలుతున్న బొగ్గును చల్లార్చకుండా నేరుగా సీహెచ్‌పీ ఫీడర్‌లలో వేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫైర్‌కోల్‌తో పొగ, వాసన వస్తుండడంతో కార్మికులు అనారోగ్యం పాలవుతున్నారు. సీహెచ్‌పీకి ఫైర్‌కోల్ రాకుండా చల్లార్చాలని, దుమ్ము, పొగ అరికట్టే చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ఇటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

దెబ్బతిన్న గృహాలకు మరమ్మతు చేపట్టాలి

రామగిరి, మే 17(ఆంధ్రజ్యోతి): నాగేపల్లి గ్రామంలోని సి-బ్లాక్‌ను సింగరేణి సేకరించాలని మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం నాగేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల బ్లాస్టింగ్ వల్ల ధ్వంసమైన గృహాలకు మరమ్మతు చేపట్టాలన్నారు. ప్రస్తుతం మరమ్మతు పనులు నాసిరకంగా ఉంటున్నాయని, దెబ్బతిన్న వాటి స్థానంలో మాత్రమే కొత్తవి వేస్తామని కొర్రీలు పెడుతున్నరని వారు ఆరోపించారు. పాడైన ఎలక్ట్రానిక్ వస్తువులను సైతం కొత్తవి కాకుండా రిపేర్ చేయిస్తామంటున్నారని, మాట తప్పితే కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. మ్యాదరవేని కుమార్, మాజీ సర్పంచ్ కొండవేన ఓదెలు యాదవ్, భాస్కర్, అనిల్, ప్రభాకర్, కొండవేన సుధాకర్, బాపు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మంథని, మే 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రాఘవులు నగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. డాక్టర్ దీక్షత్ ఆధ్వర్యంలో శిబిరానికి వచ్చిన 120 మందికి సిబ్బంది బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఏకో పరీక్షలు నిర్వహించారు. ఆసుపత్రి ఇంచార్జి గుర్రం కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్చకుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

రామగిరి, మే 17(ఆంధ్రజ్యోతి): బాసర ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సంజీవ్ పై దాడి చేయ డం అమానుషంగా ఆయన పేర్కొన్నారు. ఇలాంటివి పునవృతం కాకుండ చర్యలు తీసుకొవాలని డిమాండ్ చేశారు.